కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో...
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :93 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ శుక్రవారం 24-07-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## ఉద్యమాన్ని రాజకీయం చేయడంపై విమర్శలు

కాంగ్రెస్ పార్టీపై, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై పర్యావరణవేత్త, ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి అంగ్మో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చేస్తున్న ఈ ఉద్యమాన్ని రాజకీయ నేతలు వాడుకోవడంపై ఆమె విమర్శలు వ్యక్తం చేశారు. సోమవారం సీజేపీ చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వంటి నేతలు ఢిల్లీలోని ప్రధాని నివాసం ఎదుట నిరసన చేపట్టారు. ఈ అంశంపై వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి స్పందించారు. రాహుల్ గాంధీ ప్రధాని నివాసం ఎదుట దీక్ష చేపట్టడం సరికాదన్నారు. మోదీ నివాసం వద్ద రాజకీయ నేతలు చేపట్టిన దీక్ష నిజాయితీలేనిదని, కృత్రిమమైనదని ఆమె విమర్శించారు. విద్యార్థులు చేపడుతున్న ఈ ఉద్యమాన్ని రాజకీయ నాయకులు తమ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదన్నారు. రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నాయకులకు చిత్తశుద్ధి ఉంటే జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన దీక్షలో పాల్గొనాలని కోరారు. అంతేకాని, ప్రత్యేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ చేపట్టిన దీక్షలో నిజాయితీ లేదన్నారు. వాంగ్‌చుక్, విద్యార్థులు చేపట్టిన ఉద్యమాన్ని కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. ప్రజల్ని ఎవరూ



మోసం చేయలేరని, ఇండియా ఇప్పుడు మేల్కొందని ఆమె అభిప్రాయపడ్డారు. నిజాయితీలేని వారిని యువత తోసిపడేస్తారని గీతాంజలి అన్నారు. వాంగ్‌చుక్ ఉద్యమాన్ని, గుర్తింపును వాడుకోవాలి అనుకునేవారికి ప్రజల మద్దతు లభించబోదన్నారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దీక్ష చేపట్టిన రెండు రోజులకు గీతాంజలి వారిని విమర్శిస్తూ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, కాంగ్రెస్ చేపట్టిన దీక్షకు కూడా జాతీయ స్థాయిలో మంచి స్పందన లభించింది.

## 'దేశంలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టింది

దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న వేళ ప్రముఖ నటుడు, మక్కల్ నీది మైయమ్ పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ విద్యార్థులకు తన మద్దతు ప్రకటించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలకు సంఘీభావం తెలుపుతూ 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ చేశారు. ప్రస్తుత విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని, దేశం తన బిడ్డలను నిరాశపరిచిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. 'ఒక చిన్నారి బాధపడినప్పుడే మనం స్పందించి ఉండాల్సింది. కానీ అనేక మంది ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. బోధన స్థానాన్ని కోచింగ్, జిజ్ఞాస స్థానాన్ని ఆందోళన, ప్రతిభ స్థానాన్ని నేరాలు ఆక్రమించుకున్న ఈ వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది. విద్యార్థులకు సమాధానాలకు బదులు బారికేడ్లు, లాఠీలు ఎదురైనప్పుడు ఆ దేశం విఫలమైనట్లే' అని కమల్ హాసన్ ఘాటుగా విమర్శించారు. సీజేపీ ఆధ్వర్యంలో 'చలో సంసద్' యాత్ర చేపట్టిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం లాంటి పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జూన్ 28 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి.. 'ముందుకు సాగాల్సిన ప్రయాణంలో దేశానికి మీ అవసరం ఎంతో ఉంది. దయచేసి మీ





దీక్షను విరమించండి' అని కమల్ విజ్ఞప్తి చేశారు. అనంతరం భారతీయ విద్యార్థులను ఉద్దేశించి.. 'మీరే మాలో అత్యంత ఉత్తములు. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించారు. ఇప్పుడు దేశం తన బాధ్యతను నెరవేర్చాల్సిన సమయం వచ్చింది' అని వ్యాఖ్యానించారు. కాగా, ఇప్పటికే ఈ నిరసనలకు నసీరుద్దీన్ షా, ప్రకాశ్ రాజ్, సల్మాన్ ఖాన్, మాధవన్, షబానా అజ్మీ, రాజ్‌కుమార్ రావు తదితర సినీ ప్రముఖులు మద్దతు తెలిపారు. తాజాగా కమల్ హాసన్ సైతం విద్యార్థులకు మద్దతు నిలిచారు.

## కేంద్ర మంత్రి రాజీనామా చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం

మహబూబ్ నగర్ : నీట్‌లో జరిగిన అక్రమాలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు , పేపర్ లీక్ చేసే వారికీ కఠిన శిక్షలు పడే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఢిల్లీలో విద్యార్థి, యువతపై కేంద్ర ప్రభుత్వ అణిచివేతకు వ్యతిరేకంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వార్యాన నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి మాట్లాడుతూ పేపర్ లీకేజిలతో పిల్లల భవిష్యత్తుపై తల్లి తండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు 150 సార్లు పేపర్లు లీక్ అయితే బాద్యులపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థి, యువకులపై పోలీసులు లాఠీలతో ఇష్టం వచ్చినట్టు కొడుతున్నా బీజేపీ,కాంగ్రెస్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాక్రోచ్ పార్టీ ఆందోళనలో విద్యార్థులు, యువత కదిలి రావడంతో రాహుల్ గాంధీ హడావుడిగా మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. నీట్ పరీక్షాల నిర్వహణ బాధ్యతలు రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమాలను అరికట్టాలంటే



రాష్ట్రాలకు అధికారం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ఫీజు రియంబర్స్ మెంట్ పథకం మూసి వేయడంతో పేద విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్, నాయకులు అభిలాష్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఆంజనేయులు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నారై బీఆర్ఎస్ యూకే గ్రాండ్ సెలబ్రేషన్స్

లండన్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని యూకే వ్యాప్తంగా ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఇలాంటి పుట్టినరోజులను మరెన్నో జరుపుకోవాలని, తెలంగాణ ప్రజలకు సమర్థ నాయకత్వం అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ప్రజా సేవలో మరింత శక్తి, విజయాలను ప్రసాదించాలని కోరుకుంటూ, యూకేలోని ఎన్నారైల తరపున కేటీఆర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే లెస్టర్ పట్టణ ఇంచార్జ్ సాకేత్ రావు కాచవరపు ఆధ్వర్యంలో, మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి ముఖ్య అతిథిగా పాల్గొని ' గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఉపాధ్యక్షుడు రవి రేతినేని తెలిపారు. అదేవిధంగా లండన్‌లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు ఎన్నారై బీఆర్ఎస్ యూకే కార్యవర్గం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారమని ఉపాధ్యక్షుడు హరి గౌడ్ నవపేట్ తెలిపారు. సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిచ్చే కేటీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక



సేవా కార్యక్రమాలను చేపడతామని ఉపాధ్యక్షుడు సత్య చిలుముల తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలు, వేడుకల ద్వారా విజయవంతంగా నిర్వహించిన యూకే వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సభ్యులందరికీ ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు హరి గౌడ్ నవాపేట్, సత్యమూర్తి చిలుముల, రవి రేటినేని, సతీష్ రెడ్డి గొట్టిముక్కుల, మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, జనరల్ సెక్రటరీ రత్నాకర్ కడుదుల, కార్యదర్శి -- ఐటీ, మీడియా ఒ పీఆర్ రవి ప్రదీప్ పులుసు, అడ్వైసరీ బోర్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్

## అసోంలో ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలు.

అసోం లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర వినాశనాన్ని సృష్టిస్తున్నాయి. నదులన్నీ ఉగ్రరూపం దాల్చి ప్రమాద హెచ్చరిక స్థాయిలను దాటి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రంలో వరద పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వేలాది మంది ఇళ్లను వదిలి దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయారు. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గడిచిన 24 గంటల్లోనే నలుగురు చిన్నారులతో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో ఈ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన మొత్తం మరణాల సంఖ్య 41కి చేరుకుంది. తాజా మరణాల్లో శివసాగర్ జిల్లాలో ముగ్గురు, జోర్హాట్‌లో ముగ్గురు, చరైడియో జిల్లాలో ఇద్దరు, ధేమాజీ, కర్బీ అంగ్లాంగ్ జిల్లాల్లో ఒకరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. వీరితోపాటు మరో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం ఆరుగురు వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లోని 40 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని దాదాపు 939 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 6.53 లక్షలకుపైగా ప్రజలు ఈ వరదల దాటికి తీవ్రంగా ప్రభావితమయ్యారు. బ్రహ్మపుత్ర నదితో పాటు దాని ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. నంగ్లామురాఘాట్ వద్ద 'దిసాంగ్' నది తన ఆల్-టైమ్ రికార్డు స్థాయి ప్రమాదకర మట్టాన్ని దాటి ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అలాగే బుర్హిదిహింగ్, దిఖౌ, ధన్సిరి, కుషియారా నదులు కూడా ప్రమాదకర హెచ్చరిక స్థాయులను దాటి దిగువ ప్రాంతాలను



ముంచెత్తుతున్నాయి. బాధిత జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 487 రిలీఫ్ క్యాంపులు పంపిణీ కేంద్రాలలో దాదాపు 3.13 లక్షల మంది ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు 1.38 లక్షలకుపైగా మూగజీవాలు కూడా ఈ వరదలవల్ల ప్రభావితమయ్యాయి. ఇండియన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వాయుసేన, ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ బృందాలు రంగంలోకి దిగి ఒక్కరోజే 8,400 మందికిపైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. వరద ధాటికి 53 రోడ్లు, 6 కట్టలు పూర్తిగా ధ్వంసమై రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది.

## ఢిల్లీ ఘటనకు నిరసనగా ఇందిరాపార్కు వద్ద కేటీఆర్ దీక్ష

హైదరాబాద్ : ఢిల్లీ దాష్టీకాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్షలో పాల్గొననున్నారు. తన 50వ పుట్టినరోజున సంబరాలకు దూరంగా టూ ఢిల్లీ ఆందోళనకారులకు మద్దతు తెలియజేస్తూ ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాలో పాల్గొననున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ వెల్లడించారు. గురువారం బీఆర్ఎస్ ఎల్పీ విప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కె .పి .వివేకానంద తో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నిరసన కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష పై జరుగుతున్న పోరాటంలో అందరం సంఘటితం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. గత రెండేండ్లుగా కేటీఆర్ యువతకు మద్దతుగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన యువ సంగ్రామ సదస్సులో విద్యార్థుల ఆక్రోశం ఏ విధంగా ఉందో వెల్లడైందని తెలిపారు. నీట్ పరీక్ష పై నిరసన తెలిపే నైతికత కాంగ్రెస్ పార్టీకి లేదని పేర్కొన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్షల తారుమారుకు పూర్తి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి రాజీనామా చేయాల్సిందేనని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



చేయాలని రాహుల్ గాంధీ అన్నప్పుడు. రేవంత్ రెడ్డి ని రాజీనామా చేయాలని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. జీవో 29 నిరుద్యోగులకు పెనుశాపంగా మారడానికి ఈ ప్రభుత్వమే కారణమని వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన లాఠీచార్జ్ కు ఒక న్యాయం, హైదరాబాదులో నిరుద్యోగులపై జరిగిన లాఠీచార్జికి మరో న్యాయమా అంటూ నిలదీశారు. సిగ్గు, ఎగ్గు నైతికత ఉంటే విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు.

## తిరుమలలో హనుమంతుడి విగ్రహాన్ని దొంగిలించిన నిందితుడి అరెస్ట్

తిరుమల : తిరుపతిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలమొదటి ఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద చోరీకి గురైన హనుమంతుడి విగ్రహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. బుధవారం తెల్లవారుజామున గోవిందమాల ధరించిన భక్తుడు జశ్వంత్‌కుమార్ హనుమంతుడి చిన్న విగ్రహాన్ని చోరీ చేసి పారిపోయాడు. ఆలయం వద్ద అమర్చిన సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని విశాఖపట్నానికి చెందిన జశ్వంత్ కుమార్‌గా నిర్ధారించుకున్నారు. చోరీ అనంతరం అతను యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నట్టు సాంకేతిక ఆధారాలతో గుర్తించి వెంటనే ఒంగోలు జీఆర్పీ పోలీసులను అప్రమత్తం చేశారు. నిందితుడిని ఒంగోలు స్టేషన్ వద్ద రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరిగి విగ్రహాన్ని తిరుమలకు తీసుకొచ్చి



తిరుమల, తిరుపతి దేవస్థానం సంప్రదాయాల ప్రకారం హనుమంతుడి విగ్రహానికి పుణ్యాహవచనం చేసి పునఃప్రతిష్ఠించారు.

## నీట్ వివాదంపై 26న ఉమ్మడిగా నిరసన ర్యాలీ.. ఉద్ధవ్, రాజ్ ఠాక్రే ప్రకటన

ముంబై: నీట్ వివాదంపై జూలై 26న ఉమ్మడిగా నిరసన ర్యాలీ చేపడతామని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ప్రకటించారు. తమ శాంతియుత నిరసనను భగ్నం చేసేందుకు ప్రయత్నించే వారిని చితకబాదుతామని రాజ్ ఠాక్రే హెచ్చరించారు. (ఖసఎష్ట్రుజ, ఞఛ ఠష్ట్రుఎఎవతీఖఎ) నీట్ పేపర్ లీక్ వివాదంతో పాటు ఢిల్లీలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడిగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇద్దరు నేతలు గురువారం తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆవేదన తెలియజేయడానికే ఈ నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు వివరించారు. కాగా, జూలై 26న తలపెట్టిన ఈ ఉమ్మడి నిరసన గురించి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో తాను మాట్లాడినట్లు ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా ఇందులో పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తోందని, అయితే విద్యార్థులు ఇకపై ఎవరికీ భయపడరని అన్నారు. 'విద్యార్థులపై దాడి చేసి, మహిళా నిరసనకారుల దుస్తులు చించిన పోలీసుల బాధ్యతను ప్రధానమంత్రి తీసుకుంటారా?' అని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిరసన ర్యాలీ శివాజీ పార్క్ నుంచి ప్రారంభమై సిద్ధివినాయక ఆలయం వద్ద ముగుస్తుందని రాజ్ ఠాక్రే తెలిపారు. ఈ నిరసన సందర్భంగా ఎలాంటి రాజకీయ జెండాలను ప్రదర్శించబోమని చెప్పారు. విద్యార్థుల ఆందోళన భారీ స్థాయికి చేరడంతో ప్రభుత్వం వెనకడుగు వేసిందని విమర్శించారు. 'జూలై 26న ముంబైలో మా శాంతియుత నిరసనకు భంగం కలిగించడానికి ప్రయత్నించే ఎవరినైనా మేం చితకబాదుతాం' అని ఆయన హెచ్చరించారు.



## సంపాదకీయం

**శుక్రవారం 24-07-2026**

# విభజన చట్టం ప్రకారం సీట్లు పెంచాల్సిందే!

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించే డీలిమిటేషన్ చట్టం అమల్లోకి వస్తే కేవలం లోక్‌సభ స్థానాలే పెరుగుతాయా లేక రాష్ట్రాల శాసనసభ సీట్లు కూడా పెరుగుతాయా? అనేది ఇప్పుడు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ సర్కిళ్లలో అత్యంత ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. డీలిమిటేషన్ అనేది నియోజకవర్గాల పునర్విభజన. జనాభా మార్పులకు అనుగుణంగా అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల సంఖ్య, సరిహద్దులను మార్చడం. దీని ద్వారా అన్ని నియోజకవర్గాల్లో జనాభా దాదాపు సమానంగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ సీట్లు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలన్నీ.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో విభజన సమయంలోనే సీట్ల పెంపు హామీ ఇచ్చారు. డీలిమిటేషన్ అనగానే చాలామంది కేవలం ఎంపీ సీట్ల పెంపు గురించే చర్చిస్తున్నప్పటికీ, రాజ్యాంగ నిబంధనలు , ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణల ప్రక్రియ ప్రకారం పార్లమెంట్ సీట్లతో పాటు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు కూడా ఖచ్చితంగా పెరుగుతాయి. రాజ్యాంగంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ప్రత్యేకమైన అధికరణలు ఉండటమే దీనికి ప్రధాన కారణం. భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ స్థానాల విభజన ఆర్టికల్ 81, 82ల ప్రకారం జరిగితే.. రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన ఆర్టికల్ 170 పరిధిలోకి వస్తుంది. డీలిమిటేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, రాజ్యాంగంలోని ఈ రెండింటికీ వేర్వేరుగా లేదా ఒకే రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా సవరణలు చేయాల్సి ఉంటుంది. ఆర్టికల్ 170 పై ఉన్న నిషేధాన్ని తొలగించకుండా కేవలం ఎంపీ సీట్లను పెంచడం సాధ్యపడదు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమైతే లోక్‌సభతో పాటు ప్రతీ రాష్ట్ర శాసనసభ స్థానాల సంఖ్యను కూడా దామాషా పద్ధతిలో పెంచడానికి చట్టపరమైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన చట్టపరమైన కోణం కూడా ఉంది. 2014లో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 26 ప్రకారం.. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలో ఉన్న 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల వరకూ సీట్ల పెంపుపై ఫ్రీజ్ ఉన్నందున, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని ఆ నిబంధన అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా ఆర్టికల్ 170 సవరణ జరిగి నియోజకవర్గాల సరిహద్దుల ఫ్రీజ్ తొలగిపోతే.. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుకు ఉన్న ఏకైక రాజ్యాంగ అడ్డంకి పూర్తిగా తొలగిపోతుంది. మరి ఏపీ, తెలంగాణల్లో సీట్లు పెరుగుతాయనడానికి ఖచ్చితమైన గ్యారంటీ ఉందా అంటే.. సమాధానం నూటికి నూరు శాతం గ్యారంటీ అనే చెప్పాలి. ఎందుకంటే, కేంద్రం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక డీలిమిటేషన్ నమూనా 50 శాతం స్థానాల పెంపు ప్రాతిపదిక ప్రకారం లేదా ఏపీ విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం చూసినా సీట్ల సంఖ్య పెరగడం ఖాయం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే ఏపీలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలు 26కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు పెరిగినప్పుడు, దానికి అనుగుణంగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాల విస్తరణ జరగడం తప్పనిసరి. ప్రస్తుతం ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి కనీసం 225 లేదా అంతకంటే ఎక్కువకి , తెలంగాణ అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153 లేదా 160కి పైగా పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కావడం, అది ప్రకటన విడుదల చేయడం ద్వారా మాత్రమే కొత్త నియోజకవర్గాల సరిహద్దులు, ఎస్సీ/ఎస్టీ రిజర్వుడు స్థానాల వర్గీకరణ ఖరారవుతాయి. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర అసెంబ్లీలు మళ్లీ తీర్మానాలు చేయాల్సిన అవసరం లేదు. కేంద్ర పార్లమెంట్ ఆమోదించే డీలిమిటేషన్ చట్టమే రాష్ట్ర స్థానాల పెంపునకు నేరుగా వర్తిస్తుంది. ఈ సీట్ల పెంపు ప్రక్రియ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన రాజకీయ సంచలనాలకు, సమీకరణలకు దారితీయనుంది. ప్రతి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు, యువ నాయకులకు కొత్తగా ఎమ్మెల్యేగా పోటీ చేసే సువర్ణావకాశం లభిస్తుంది. అంతేకాకుండా, గ్రేటర్ హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లోనూ, అమరావతి పరిసర ప్రాంతాల్లోనూ జనాభా ప్రాతిపదికన మరిన్ని కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీలో 175, తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లతోనే ఎన్నికలు జరుగుతాయి. 2028 చివర్లో తెలంగాణ, 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరగవచ్చు. ఇది ప్రజలకు కొత్త సమస్యలు తెస్తుంది. జనాభా పెరిగిన ప్రాంతాల్లో ఒక ఎమ్మెల్యేకి ఎక్కువ ఓటర్లు, అసమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్, విజయవాడ, విశాఖ పట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువ కాబట్టి వారి సమస్యలు సరిగా ప్రతిబింబించకపోవచ్చు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గినట్టు అనిపించవచ్చు. డీలిమిటేషన్ పార్లమెంట్‌కే పరిమితం కాదు, అది రాష్ట్రాల శాసనసభలను కూడా సమాంతరంగా పునర్వ్యవస్థీకరిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లులు చట్ట రూపం దాల్చిన మరుక్షణమే డీలిమిటేషన్ కమిషన్ రంగంలోకి దిగుతుంది. అందువల్ల ఏపీ , తెలంగాణ అసెంబ్లీలలో స్థానాలు పెరగడం అనేది కేవలం ఒక రాజకీయ అంచనా మాత్రమే కాదు, రాజ్యాంగపరంగా, చట్టపరంగా జరగబోయే ఒక అనివార్యమైన పరిణామం!

# హమాస్‌కు కొత్త బాస్.. గాజా కన్నీళ్లు తుడుస్తాడా?

యుద్ధం, ఆకలి, నిరాశ్రయ జీవితంతో అల్లాడుతున్న గాజాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హమాస్ కొత్త అత్యున్నత నాయకుడిగా ఖలీల్ అల్-హయ్యా ఎన్నికయ్యారు. యాహ్యా సిన్వార్ తర్వాత సంస్థ పగ్గాలు చేపట్టిన ఆయనకు హమాస్ అంతర్గత ఎన్నికల్లో బాధ్యతలు అప్పగించారు. అయితే ఈ నాయకత్వ మార్పుతో గాజా ప్రజల ముఖచిత్రంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు!..యుద్ధం తమ ఇళ్లను, కుటుంబాలను, భవిష్యత్‌ను దెబ్బతీసిన వేళ.. హమాస్ నాయకత్వ మార్పుపై గాజా ప్రజల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు కొత్త నాయకుడు కాల్పుల విరమణ దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తుండగా.. మరికొందరు నాయకులు మారినా పరిస్థితులు మారకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఎవరీ ఖలీల్ అల్-హయ్యా?

ఖలీల్ అల్-హయ్యా హమాస్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ రాజకీయ నేత. గాజాలో జన్మించిన ఆయన.. 1987లో హమాస్ ఏర్పాటైన నాటి నుంచి సంస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇస్లామిక్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన.. అనంతరం జోర్డాన్, సూడాన్‌లలో ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయాల్లోకి రాకముందు కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన అల్-హయ్యా.. ఆ తర్వాత హమాస్‌లో చురుకైన నాయకుడిగా ఎదిగారు. 2006లో పాలస్తీనా శాసనసభ ఎన్నికల్లో గాజా నుంచి విజయం సాధించారు. అనంతరం హమాస్ పొలిట్‌బ్యూరోలో కీలక సభ్యుడిగా మారారు. హమాస్ మాజీ నేతలు ఇస్మాయిల్ హనియె, యాహ్యా సిన్వార్‌లకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆయన.. సంస్థ రాజకీయ వ్యవహారాల్లో ముఖ్యమైన నిర్ణయాల్లో భాగస్వామిగా ఉన్నారు.

### చర్చల బల్లపై కీలకంగా..

ఖలీల్ అల్-హయ్యాకు మరో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇజ్రాయెల్‌తో జరిగిన పరోక్ష చర్చల్లో హమాస్ తరఫున ఆయన కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా బందీల విడుదల, కాల్పుల విరమణ ఒప్పందాలపై ఖతార్, ఈజిప్ట్ వంటి మధ్యవర్తి దేశాలతో చర్చలు జరిపిన అనుభవం ఆయనకు ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఎన్నికతో భవిష్యత్‌లో హమాస్ చర్చల వైఖరి ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. యుద్ధాన్ని కొనసాగించే వైఖరినే అనుసరిస్తారా? లేక చర్చలకు మరింత ప్రాధాన్యం ఇస్తారా? అన్నది ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

### యుద్ధం మిగిల్చిన వ్యక్తిగత విషాదం

ఖలీల్ అల్-హయ్యా జీవితంలోనూ యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉంది. 2007లో ఆయన ఇంటిపై జరిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడిలో భార్య, పిల్లలు, సోదరులు సహా పలువురు కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాతి సంవత్సరాల్లో జరిగిన దాడుల్లోనూ ఆయన కుటుంబానికి చెందిన మరికొందరు మరణించారు. ఈ వ్యక్తిగత విషాదాలు ఆయన రాజకీయ వైఖరిపై ప్రభావం చూపాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్‌పై కఠిన వైఖరిని కొనసాగించే నేతల్లో ఆయన ఒకరిగా గుర్తింపు పొందారు.




### గాజా ప్రజలకు బతుకే ముఖ్యం

హమాస్‌లో కొత్త నాయకుడు ఎన్నికైనప్పటికీ.. గాజాలో సామాన్య ప్రజల ఆలోచనలు మాత్రం వేరుగా ఉన్నాయి. యుద్ధం కారణంగా ఇళ్లు కోల్పోయి, శిబిరాల్లో జీవిస్తున్న వేలాది కుటుంబాలకు రాజకీయ పరిణామాల కంటే రోజువారీ అవసరాలే ప్రధానంగా మారాయి. "మాకు నాయకులు మారడం ముఖ్యం కాదు.. మా పిల్లలకు ఆహారం కావాలి. తాగునీరు కావాలి. మందులు కావాలి. భయం లేకుండా జీవించే పరిస్థితి కావాలి" అని పలువురు గాజా ప్రజలు చెబుతున్నారు. మరికొందరు.. "ఏ నాయకుడు వచ్చినా మా జీవితాల్లో మార్పు కనిపించకపోతే ప్రయోజనం ఏమిటి? మాకు శాంతి కావాలి" అంటూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆశలు.. అనుమానాలు రెండూ

ఖలీల్ అల్-హయ్యాకు చర్చల అనుభవం ఉండటంతో కాల్పుల విరమణ, బందీల విడుదల, మానవతా సహాయం వంటి అంశాల్లో పురోగతి సాధించే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. అయితే మరో వర్గం మాత్రం నాయకుడు మారినా హమాస్ ప్రాథమిక విధానాల్లో పెద్ద మార్పు ఉండకపోవచ్చని అనుమానం వ్యక్తం చేస్తోంది. ఆయన ఎన్నిక హమాస్ పోరాట వైఖరిని కొనసాగించే సంకేతమని విశ్లేషిస్తున్నవారూ ఉన్నారు.

### ముందున్న అతిపెద్ద సవాల్ ఇదే

ప్రస్తుతం ఖలీల్ అల్-హయ్యా ముందున్న సవాల్ హమాస్‌ను నడిపించడం మాత్రమే కాదు. యుద్ధంతో తీవ్రంగా దెబ్బతిన్న గాజాలో పరిస్థితులను ఎలా ఎదుర్కొంటారు? కాల్పుల విరమణను స్థిరంగా కొనసాగించగలరా? అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య సంస్థ భవిష్యత్ వ్యూహాన్ని ఎలా రూపొందిస్తారు? అన్నది కీలకంగా మారింది. గాజాలో మానవతా సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. లక్షలాది మంది నిరాశ్రయులుగా మారగా.. ఆహారం, వైద్యం, విద్యుత్, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ఖలీల్ అల్-హయ్యా నాయకత్వంపై ప్రపంచం దృష్టి పెట్టినా.. గాజా ప్రజల ఆకాంక్ష మాత్రం ఒక్కటే. "మాకు రాజకీయ విజయాలు వద్దు.. మా పిల్లలు భయపడకుండా బతికే రోజు రావాలి."

# సిగ్గు పడాల్సిందెవరు? పోలీసులా... పాలకులా?




అమరావతి,ఏపీలో పోలీస్ వ్యవస్థ పనితీరు ఎంత అధ్వానంగా వుందో కేంద్ర ప్రభుత్వం చెప్పాల్సిన పనిలేదు. ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న, అలాగే ఆ రాష్ట్ర పనితీరును గమనిస్తున్న ఎవరైనా ఈజీగా చెప్పగలరు. తాజాగా కేంద్రప్రభుత్వం ప్రకటించిన ర్యాంక్ కేవలం సాంకేతికపరమైన అంశమే. దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 36 పోలీస్‌శాఖల పనితీరుపై కేంద్ర హోంశాఖ ఇచ్చిన నివేదికలో ఆంధ్రప్రదేశ్ 26వ స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా పోలీసుల పనితీరును నాలుగు విభాగాలుగా చేసి, లెక్క కట్టింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, పరిపాలన సంస్కరణలకు 20 శాతం, నిర్వహణ సమర్థతకు 45 శాతం, సమాచార - సాంకేతికత అమలుకు 25 శాతం, పోలీస్ వైద్య, ఆరోగ్య, న్యాయశాఖల మధ్య సమన్వయానికి 10 శాతం పాయింట్లు చొప్పున కేటాయించడం గమనార్హం. ఇందులో పరిపాలన సంస్కరణలకు 14.84 పాయింట్లు, నిర్వహణ సమర్థతకు 45కు 29.88 శాతం, సాంకేతికత విషయంలో 25కు 12.75, అలాగే సమన్వయానికి సంబంధించి 10కి 7.06 పాయింట్లు దక్కడం చర్చనీయాంశమైంది. మొత్తం 100కు 64.53 పాయింట్లకు దక్కించుకుని 26వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖ నిలిచింది. పోలీస్‌శాఖ పనితీరు ఎంత అధ్వానంగా వుందో అర్థం చేసుకోడానికి విజయవాడ కాపు యువకుడు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్‌తో పాటు అతని బూడిద కూడా దొరక్కుండా చేసిన వైనం చాలు. అలాగే విజయవాడ దళిత యువకుడు క్రాంతికుమార్ ఆత్మహత్యకు సీఐ వేధింపులే కారణమవడం మరో ఉదాహరణ. గత వారంలో గుంటూరు నగరం నడిబొడ్డున ఒక మహిళను వివస్త్రను చేసి కొట్టడం... పోలీస్ వైఫల్యమే ప్రధాన కారణం. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుని వుంటే, దుశ్శాసనపర్వానికి తెరలేచేది కాదు. ఈ రెండేళ్లలో సస్పెండ్ అయిన సీఐలు, ఎస్ఐలు, పోలీసుల లెక్క తీస్తే, ఆ వ్యవస్థ ఎంత అధ్వానంగా వుందో అర్థం చేసుకోడానికి ఉపకరిస్తుంది. పోలీసులు నిబంధనల్ని అనుసరించి విధులు నిర్వర్తించడం మరిచిపోయారన్న విమర్శ బలంగా వుంది. అధికార పార్టీ నాయకులు చెబితే తప్ప, నిందితులపై కేసులు నమోదు చేసే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో లేదనే విమర్శను కొట్టి పారేయలేం. ఒక మహిళను వివస్త్రను చేస్తే, దారుణానికి పాల్పడ్డ టీడీపీ నేత, ఆయన కుటుంబ సభ్యులపై కేసు పెట్టడానికి గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశాల కోసం పోలీసులు ఎదురు చూశారంటే ఏమనుకోవాలి? పోలీస్ యంత్రాంగం ఎటు పోతోంది? రాజకీయ నాయకులు చెప్పినట్టే చేస్తే, ఏమవుతుందో కటకటాల్లో ఉన్న కృష్ణలంక సీఐ నాగరాజు ఉదంతమే నిదర్శమని పలువురు చెబుతున్నారు. అలాగే ముంబయ్ నటి కాదంబరి జెత్వానీ కేసు ఏ మలుపు తిరిగిందో అందరూ చూస్తున్నారు. సీఐడీ దర్యాప్తులో జెత్వానీనే అసలు కిలాడీగా తేల్చారు. ఈ వ్యవహారంలో అన్యాయంగా ముగ్గురు ఐపీఎస్ అధికారుల్ని బలిగొంది ఎవరు? ఈ పరిణామాలన్నీ పోలీస్ శాఖ తన పరువు తానే తీసుకుంటున్నట్టు కాదా? పోలీస్‌శాఖలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరగడం వల్లే, ఇవాళ దేశంలోనే పరువు పోగొట్టుకోవాల్సి వస్తోందని ఆ శాఖకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. పోలీసుల్ని తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించని పాలకులు సిగ్గు పడాలా? లేక ఇంకెవరైనా అని ఆలోచించాల్సిన పరిస్థితి. ఎవరికీ అధికారం శాశ్వతం కాదు. అధికారంలో ఉన్నోళ్ల ప్రాపకం కోసం, నిబంధనల్ని ఉల్లంఘించి ప్రవర్తిస్తే , భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవాల్సింది తామే అని హోంగార్డు మొదలుకుని, అత్యున్నత స్థాయిలోని పోలీస్ అధికారి వరకూ ఆలోచించాలి. దేశంలో తమ శాఖ 26వ స్థానంలో నిలబడడానికి ప్రధాన కారణం, రాజకీయ జోక్యమే అని పోలీసులకు బాగా తెలుసు. అధికారంలో ఉన్నోళ్ల మెహర్బానీ కోసం కాకుండా, తమ విధుల్ని నిక్కచ్చిగా నిర్వర్తించడంలోనూ, నిస్సహాయులకు అండగా నిలబడడంలో దక్కే ఆనందం మరెందులోనూ లభించదని అన్నిస్థాయిల్లోని పోలీసులు గుర్తించుకోవాలి. అప్పుడు మాత్రమే ప్రజారక్షకులుగా నిజాయితీతో బాధ్యతలు నిర్వర్తించగలుగుతారు. లేదంటే ప్రజాభక్షకులుగా మారి, జైళ్లపాలవుతారనే హెచ్చరికను దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే తమ ఏలుబడిలో దేశంలో అత్యంత అధ్వానమైన ఫర్మామెన్స్‌ను పోలీస్‌శాఖ ప్రదర్శించడంపై పాలకులు సిగ్గు పడాలనే పౌర సమాజ అభిప్రాయం ఎంతో విలువైంది.

# హమ్మయ్య.. వానలు పడ్డాయ్...

అదిలాబాద్,ఎట్టకేలకు వరుణుడు కాస్త కరుణించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ముఖాల్లో మళ్లీ చిరునవ్వులు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షం జాడ లేక ఎండిపోతున్న పంటలను చూసి ఆందోళన చెందుతున్న రైతులకు తాజాగా కురిసిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పెద్ద ఊరటనిచ్చింది. ఎల్ నీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ జల్లులు కొత్త ఆశలను నింపాయి. ఈ వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. అడపాదడపా కురిసిన చిరు జల్లులు కూడా సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో పంటలు ఎండిపోతాయనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఒకవైపు పొలాల్లో తేమ పూర్తిగా తగ్గిపోగా, మరోవైపు వర్షం కోసం రైతులు కళ్లు కాయలు కాచే పరిస్థితి నెలకొంది. వరుణుడు కరుణించాలని జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు కూడా నిర్వహించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నాలు అందరినీ కదిలించాయి. కొందరు స్ప్రింక్లర్లతో నీటిని అందిస్తూ పంటలను బతికించేందుకు శ్రమించగా, మరికొందరు ఎడ్లబండ్లపై డ్రమ్ముల్లో నీళ్లు తీసుకొచ్చి మొలకలకు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. వర్షాభావం కారణంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న రైతులకు ఈ వాన కొంత ఊరటనిచ్చిందనే చెప్పాలి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన ముసురు క్రమంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంగా మారింది. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలం బరంపూర్‌లో అత్యధికంగా 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇంద్రవెల్లి మండలం హీరాపూర్‌లో అత్యల్పంగా 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, భైంసాలో మాత్రం వర్షపాతం నమోదు కాలేదు. ఇప్పటికీ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నా, తాజాగా కురిసిన వర్షం మాత్రం కొంత ఆశను నింపింది. ఇన్ని రోజులుగా వాన కోసం ఎదురు చూసిన

# స్టార్టప్ టూ... స్కై హై...

హైదరాబాద్,శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుండి జూలై 18, శనివారం, మధ్యాహ్నం 12:05 గంటకి విక్రమ్-1 ప్రయోగం ప్రారంభమైంది. 17 నిమిషాల తర్వాత, ఇది తన పేగులకు సంబంధించిన ఉపకరణాలను విజయవంతంగా విడుదల చేసింది. ఈ ఘనతకు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌లో సంబరాలు గట్టిగా జరిగాయి. ఈ తొలి ప్రయోగం, 'ఆగమన్' అని పిలువబడింది, భారతదేశాన్ని ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యం కలిగిన మూడవ దేశంగా నిలిపింది. అయితే, తెలంగాణకు ఇది ఒక దశాబ్ద కాలం పాటు ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడానికి పెట్టిన పెట్టుబడికి ఫలితం. ఈ ప్రయాణం 2015 నవంబరులో ప్రారంభమైంది, అప్పటి ఐటీ మరియు పరిశ్రమల మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో టీ హబ్ ప్రారంభమైంది, ఇది అప్పటివరకు భారతదేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇన్క్యుబేటర్. ప్రారంభోత్సవంలో, రతన్ టాటా దీనిని 'భారతదేశానికి కొత్త ముఖం' అని పేర్కొన్నారు. ఈ చుట్టూ, రాష్ట్రం విస్తృతమైన నెట్‌వర్క్‌ను నిర్మించింది - ప్రోటోటైపింగ్ కోసం టీ వర్క్స్, మహిళా వ్యాపారులకు, నైపుణ్యాలు, పరిశోధన మరియు అకాడమియా-ఇండస్ట్రీ సంబంధాల కోసం టాస్క్, రిచ్ తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్. స్కైరూట్ ఎయిరోస్పేస్ ఈ వ్యవస్థలో జన్మించింది. 2018లో, మాజీ ఇస్రో శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన మరియు నాగ భారత్ డాకా స్థాపించిన ఈ కంపెనీ, ౦-ఊబీఎల్‌లో ప్రారంభ సంవత్సరాలలో ఇన్క్యుబేట్ చేయబడింది, మెంటార్‌షిప్, పెట్టుబడిదారుల ప్రాప్తి మరియు వ్యాపార మద్దతు పొందింది. ఇది డ్రాయింగ్‌ల నుండి హార్డ్‌వేర్‌కు మారుతున్నప్పుడు, తన ఇంజనీర్లకు ప్రోటోటైపింగ్ సౌకర్యాలను అందించింది, దీని ద్వారా భాగాలను డిజైన్ చేయడం, పరీక్షించడం మరియు మెరుగుపరచడం జరిగింది. దీని వల్ల సాధించిన ఫలితాలు త్వరగా వచ్చాయి. 2022 నవంబరులో, స్కైరూట్ యొక్క ఉపఆర్బిటల్ విక్రమ్-ఎస్, ఇస్రో యొక్క సౌకర్యాల నుండి రాకెట్‌ను ప్రయోగించిన తొలి భారతీయ ప్రైవేట్ కంపెనీగా నిలిచింది. టీ హబ్ లో జరిగిన ఒక వేడుకలో, కేటీఆర్ దీనిని భారతదేశం యొక్క అంతరిక్ష సాంకేతిక పరిశ్రమకు 'నిజంగా చరిత్రాత్మక క్షణం' అని పేర్కొన్నాడు. 'ఇది హైదరాబాద్ నుండి మరింత మంచిగా జరగలేదు' అని చెప్పాడు మరియు రాష్ట్రంలో దేశంలోని తొలి సమగ్ర రాకెట్ డిజైన్, తయారీ మరియు పరీక్షా సౌకర్యం కోసం ప్రోత్సహించాడు. 'వారు తమ రాకెట్లను ఇతర ప్రాంతాలకు పంపకూడదు' అని ఆయన అన్నారు. 2025 నవంబరులో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హైదరాబాద్‌లోని స్కైరూట్ యొక్క ఇన్ఫినిటీ క్యాంపస్‌లో ఫ్లైట్-రెడీ విక్రమ్-1ను ఆవిష్కరించారు. 2026 మే నాటికి, ఈ కంపెనీ భారతదేశంలోనే తొలి స్పేస్ టెక్ యూనికార్న్‌గా మారింది. రెండు నెలల తర్వాత, ఇది ఉపగ్రహాలను ఆకాశంలోకి పంపించింది. విక్రమ్-1, సుమారు 20 మీటర్ల ఎత్తు, 350 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహాలను తక్కువ భూమి కక్ష్యలోకి తీసుకెళ్లగలదు - ఇది హైదరాబాద్‌ను ప్రపంచ చిన్న ఉపగ్రహాల మ్యాప్‌లో బలంగా నిలబెట్టింది మరియు నగరానికి కొత్త రకం ప్రొపల్షన్, ఉపగ్రహ మరియు ఎయిరోస్పేస్-మటీరియల్స్ స్టార్టప్‌లను ఆకర్షించింది. భారతదేశానికి, ఇది ప్రైవేట్ స్పేస్‌ఫ్లైట్‌లో ఒక దూకుడు. తెలంగాణకు, ఇది చివరకు ప్రారంభానికి క్లియర్ అయిన దృష్టి.

# యూనిఫాం 50 శాతంపై సౌత్ స్టేట్స్ హ్యాపీ

హైదరాబాద్, దేశంలో నియోజకవర్గాల పునర్విభజ అంశం సరికొత్త మలుపు తిరిగింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాల సీట్లు విపరీతంగా పెరిగి, జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో దారుణంగా పడిపోతుందనే భయాలు ఇన్నాళ్లూ ఉండేవి. అయితే, కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిన యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ఫార్ములా ఈ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ఏ రాష్ట్రానికీ ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలను యాభై శాతం పెంచే ఈ మధ్యేమార్గ ఫార్ములాకు దక్షిణాదిలోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు లోపాయకారీగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై కేంద్రం ప్రతిపాదించినట్లుగా ప్రచారం జరుగుతున్న "యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ఫార్ములా" పట్ల దక్షిణాది పార్టీలు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

దక్షిణాది పార్టీల వైఖరి సానుకూలత:

జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పడిపోతుందనే భయాలు ఉండేవి. అయితే, ఏ రాష్ట్రానికీ ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలను 50% పెంచే ఈ మధ్యేమార్గ ఫార్ములాకు దక్షిణాది ప్రాంతీయ పార్టీలు లోపాయకారీగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

డీఎంకే (తమిళనాడు): జనాభా ప్రాతిపదికన వెళ్తే తీవ్రంగా నష్టపోయే తమిళనాడు, ఈ ఫార్ములా వల్ల తమ సొంత రాష్ట్రంలో పొలిటికల్ స్పేస్ పెరగడమే కాకుండా పార్లమెంట్‌లో గొంతుక మరింత బలపడుతుందని భావిస్తోంది. ప్రాంతీయ ప్రయోజనాల దృష్ట్యా దీనిని తిరస్కరించాల్సిన అవసరం లేదని స్టాలిన్ ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

బీఆర్ఎస్ (తెలంగాణ): పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి నిష్పత్తి దారుణంగా పడిపోనంత కాలం, ఈ 50% పెంపుదల మోడల్ వల్ల తమకు వచ్చే నష్టమేమీ లేదని భావిస్తూ సానుకూల ధోరణిలోనే ఉంది.

తమిళనాడు, తెలుగు రాష్ట్రాల సీట్ల సమీకరణాలు

ఈ ఫార్ములా ప్రకారం మూడు రాష్ట్రాలలో సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. దీనివల్ల ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం లభించడంతో పాటు రాజకీయ పునరేకీకరణకు క్షేత్రస్థాయిలో మార్గం సుగమం అవుతుంది. రాష్ట్రాల వారీగా మారబోయే సీట్ల అంచనాలు:రాష్ట్రంప్రస్తుత లోక్‌సభ సీట్లు50% ఫార్ములా ప్రకారం పెరిగే సీట్లు (అంచనా)

| | | |
|---|---|---|
| తమిళనాడు | 39 | 59 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 37 - 38 |
| తెలంగాణ | 17 | 25 - 26 |

రాష్ట్రాలకు వచ్చే అదనపు సీట్లను, కేంద్ర నిధుల వాటాలను కోల్పోకూడదనే ఆర్థిక కోణంతో పాటు, ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతినకుండా పార్లమెంట్‌లో బలం పెరుగుతుండటంతో డీఎంకే, బీఆర్ఎస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ సహా దాదాపు అన్ని పార్టీలు ఈ కొత్త పొలిటికల్ రియాలిటీని స్వీకరించే దిశగానే అడుగులు వేస్తున్నాయి.

# నిర్మల్ పట్టణంలో దొంగల హల్ చల్

నిర్మల్ ,కేంద్రంలోని వెంకటాపూర్ ఎస్సీ కాలనీలో నిన్న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు తాళం వేసి ఉన్న మూడు ఇండ్ల తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి దోపిడీకి తెగబడ్డారు ఐదు తులాల బంగారం 40 గ్రాముల వెండి, 40 వేల రూపాయల నగదును దోచుకుని వెళ్లారు . ఈ సందర్భంగా కాలనీకి చెందిన యువకుడు మాట్లాడుతూ నిన్న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు తలం వేసి ఉన్న మూడు ఇండ్ల తాళాలు పగలగొట్టి సూర్యకి పాల్పడ్డారని, పెద్ద ఎత్తున బంగారం వెండి నగలు 40 వేల రూపాయల నగదును దోచుకుని వెళ్లారని డి.ఎస్.పి సీఐ లు వచ్చే పరిశీలించారని, నిందితులను గుర్తించి పట్టుకొని న్యాయం చేయాలని కోరారు

## డిజిటల్ లూప్‌లో వైసీపీ...

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీశాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల పూర్తిగా డిజిటల్ పాలిటిక్స్ వైపే మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. సొంత యాప్స్, టెక్నాలజీతో మన రాత మారిపోతుంది, కేడర్ అంతా డిజిటల్ వేదికలపై యాక్టివ్ కావాలి అని జగన్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం.. క్షేత్రస్థాయి రాజకీయాలను విస్మరించి క్యాడర్‌ను మభ్యపెట్టడమేనా అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల నుండి వస్తున్నాయి. కేవలం డిజిటల్ ప్రచారం, సొంత యాప్‌ల సృష్టి ద్వారా ఒక ప్రాంతీయ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఎంతవరకు మైలేజ్ సాధించగలదనే అంశంపై భిన్నాభిప్రాయాలువ్యక్తమవుతున్నాయి. ఆధునిక రాజకీయాల్లో సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారాల ప్రాధాన్యత పెరిగిన మాట వాస్తవమే. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఎక్స్‌టర్నల్ ప్లాట్‌ఫామ్‌లలో వారి కంటెంట్‌కు ఆశించిన స్థాయిలో రీచ్ రాకపోవడం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు, కఠిన నిబంధనల కారణంగా పాత తరహా ప్రచారం నెమ్మదించింది. సాంప్రదాయ సోషల్ మీడియా సంస్థలు మన కంటెంట్‌ను నియంత్రించలేవని చెప్తూ.. పార్టీ కోసం ప్రత్యేకంగా సొంత యాప్‌లు, ఇన్-హౌస్ కమ్యూనికేషన్ టూల్స్ క్రియేట్ చేయడంపై జగన్ ఫోకస్ పెట్టారు. కానీ, ఈ డిజిటల్ గోడల మధ్య జరిగే ప్రచారం కేవలం సొంత డబ్బా లాగా మారి, కేవలం వైఎస్సార్‌సీపీ అభిమానులకే పరిమితం అవుతుందే తప్ప, తటస్థ ఓటర్లలోకి చొచ్చుకెళ్లే అవకాశం చాలా తక్కువని అభిప్రాయపడుతున్నారు.రాజకీయాల్లో డిజిటల్ ప్రచారం అనేది ఎప్పుడూ క్షేత్రస్థాయి పోరాటాలకు ఒక సపోర్టింగ్ టూల్ మాత్రమే కావాలి కానీ, అదే ప్రధాన ప్రత్యామ్నాయం కాలేదు. వైఎస్ జగన్ గతంలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం సుదీర్ఘమైన పాదయాత్ర, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావడం. కానీ, ప్రస్తుత ప్రతిపక్ష హోదాలో వైఎస్సార్‌సీపీ రాజకీయాలు ఇంకా రోడ్ల మీదికి, ప్రజల మధ్యకు చేరడం లేదనేది బహిరంగ రహస్యం. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్తూ ధర్నాలు చేయకుండా.. కేవలం ఏసీ రూముల్లో కూర్చుని ట్వీట్లు, ప్రెస్ మీట్లు, యాప్‌లలో అప్‌డేట్లకు పరిమితం కావడం వల్ల మైలేజ్ రావడం కష్టమని సోషల్ మీడియా ట్రెండ్స్ చెబుతున్నాయి.ఈ డిజిటల్ పాలిటిక్స్ వల్ల క్యాడర్ అంతర్గతంగా ఒక తప్పుడు భరోసాలో ఉండిపోయే ప్రమాదం ఉంది. యాప్‌లో బటన్ నొక్కితే ప్రచారం జరిగిపోతుంది.. రాత మారిపోతుంది అని అధినేత చెప్పడం వల్ల.. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడే సాధారణ కార్యకర్తల్లో కదలిక తగ్గుతుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ప్రజల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడినప్పుడు, ప్రజల్లో ఆ పార్టీపై నమ్మకం సడలుతుంది. డిజిటల్ స్క్రీన్లపై కనిపించే (గ్రాఫిక్స్, హాష్‌ట్యాగ్‌లు) ఓట్లుగా మారవనే దేని నిజం 2024 ఎన్నికల్లో స్పష్టమైంది. జనాల్లోకి వెళ్లకుండా కేవలం డిజిటల్ పోరాటాలకే ప్రాధాన్యత ఇస్తే.. అది కేవలం పార్టీ శ్రేణులను తాత్కాలికంగా మభ్యపెట్టడానికే ఉపయోగపడుతుంది.డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సులువే కానీ, నేరుగా ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కాకపోతే ఆ మైలేజ్ వల్ల లాభం శూన్యం. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎప్పుడూ తమ కోసం రోడ్డుపై నిలబడే నాయకుడినే గుర్తిస్తారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు సైతం ఫీల్డ్ వదిలేసి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం కావడం పార్టీ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీస్తోంది. కొత్త యాప్‌ల ద్వారా కేడర్‌ను అనుసంధానించవచ్చు కానీ, అది జనాల్లోకి వెళ్లేందుకు కేవలం ఒక మార్గమే కావాలి. డిజిటల్ వ్యూహాలు పార్టీ అంతర్గత సమన్వయానికి , అర్బన్ ఓటర్లను ఆకర్షించడానికి కొంతవరకు మేలు చేయవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్ లాంటి వైవిధ్యమైన రాజకీయ వాతావరణం ఉన్న రాష్ట్రంలో సొంత యాప్స్ పాలిటిక్స్ ఓట్ల రాతను మార్చలేవు. వైఎస్సార్‌సీపీ తిరిగి పుంజుకోవాలంటే డిజిటల్ స్క్రీన్లను దాటి, ప్రజల గడప తొక్కాల్సిందే. క్షేత్రస్థాయి పోరాటాల నుంచి వచ్చే అసలైన ప్రజాదరణ మైలేజ్‌కు, డిజిటల్ ప్రపంచంలో వచ్చే తాత్కాలిక వ్యూస్‌కు చాలా తేడా ఉంటుందనే విషయాన్ని గ్రహించకపోతే.. వైఎస్సార్‌సీపీ డిజిటల్ లూప్‌లోనే ఉండిపోయే ప్రమాదం ఉందన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.

## పోటీకి రెడీ అవుతున్న తోట

గుంటూరు, మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ తిరిగి యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన ఏ పార్టీలో చేరతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తోట చంద్రశేఖర్ బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు ఆ పార్టీలో దాదాపుగా లేరనే చెప్పాలి. తాజాగా తోట చంద్రశేఖర్ రెండు పార్టీల వైపు చూస్తున్నట్టు తెలిసింది. బీజేపీలో చేరడం, లేదా వైసీపీలో చేరడంపైనే ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. జనసేనలో చేరే అవకాశం లేకపోవడంతో ఇక ఈ రెండు పార్టీల్లో ఏదో ఒక దానిలో చేరి వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అయితే రెండు పార్టీల నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదని చిరంజీవితో సమావేశం తర్వాత... కొంత కాలం క్రితం మెగాస్టార్ చిరంజీవితో తోట చంద్రశేఖర్ సమావేశమయ్యారు. తోట చంద్రశేఖర్ జనసేనలో చేరతారని ప్రచారం గత కొంత కాలంగా జరుగుతుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరతారని జోరుగా ఊహాగానాలు వచ్చాయి. అందుకే చిరంజీవిని కలిశారని అనుకున్నారు. కానీ జనసేన నుంచి ఆయనకు సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఆయన సొంత మీడియాలో కూడా జనసేనకు వ్యతిరేకంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో వైసీపీ లేదా బీజేపీలో చేరతారని తాజాగా ఆయన అనుచరులు చెబుతున్నారు.... తోట చంద్రశేఖర్ కాపు సామాజికవర్గం కావడంతో వైసీపీ కూడా ఆయన చేరిక పట్ల కొంత సానుకూలతగా ఉన్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లాలోనే ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తోట చంద్రశేఖర్ భావిస్తున్నారు. ఆ హామీ పార్టీ నాయకత్వం నుంచి లభిస్తే త్వరలోనే ఆయన చేరిక ఉంటుందని అంటున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బలమైన నేత అవసరం తోట చంద్రశేఖర్ సామాజికవర్గం పరంగా, ఆర్థికంగా బలమైన నేత కావడంతో ఆయన చేరికకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని అంటున్నారు. త్వరలోనే తోట చంద్రశేఖర్ చేరిక ప్రకటన వస్తుందని, తద్వారా వైసీపీకి కూడా కాపు సా మాజికవర్గం నుంచి మరికొంత బలం చేకూరుతుందని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అయితే జగన్ దీనిపై ఫైనల్ డెసిషన్ తీసుకోవాల్సి ఉంది.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

లక్నో,ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోండా రైల్వే స్టేషన్ సమీపంలో ఒక గూడ్స్ రైలు ప్రమాదానికి గురైంది. ప్రమాద వివరాలు: గూడ్స్ రైలుకు చెందిన ఒక వ్యాగన్ పట్టాలు తప్పి పక్కకు ఒరిగిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు మరియు ఉన్నతాధికారులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకున్నారు. పునరుద్ధరణ చర్యలు: రైల్వే సిబ్బంది రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ప్రయాణీకుల రాకపోకలు: ప్రయాణీకులకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ఇతర ప్లాట్‌ఫారమ్ల ద్వారా రైళ్ల రాకపోకలను అధికారులు సజావుగా కొనసాగిస్తున్నారు.

# ప్రమాదంలో గల్ఫ్ దేశాల భద్రత



టెహ్రాన్ జులై 13న సౌదీ అరేబియాపై, మళ్ళీ జులై 17న ప్రిన్స్‌సుల్తాన్ ఎయిర్ బేస్‌పై క్షిపణులను ప్రయోగించగా, తూర్పు సిరియాలోని ఒక అమెరికా కమాండ్ పోస్ట్‌పై తమ మొదటి దాడి చేసిన ట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కారప్స్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. యెమెన్‌లో, తమ నియంత్రణలో ఉన్న విమానాశ్రయం పై రియాద్ బాంబు దాడి చేసిందని ఆరోపి స్తూ హౌతీలు సౌదీ అరేబియాపై తమ ప్రతి క్షిపణి దాడిని ప్రారంభించారు. దీంతో నాలుగేళ్ల కాల్పుల విరమణ ముగిసింది. విస్తరిస్తున్న సౌదీ కూటమి పాకిస్తాన్‌ను ఈ వివాదంలోకి లాగింది.హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న మూడు ట్యాంకర్లపై టెహ్రాన్ దాడి చేసిన తరువాత, జులై 8న ఇరాన్‌పై వైమానిక దాడులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా 80కి పైగా ఇరాన్ లక్ష్యాలపై దాడి చేసి, నౌకాదళ దిగ్బంధనాన్ని తిరిగి విధించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌తో కుదిరిన 60 రోజుల కాల్పుల విరమణ, జూన్ 17 అవగాహన ఒప్పందం 'ముగిసిపోయినట్లు' ప్రకటించారు. జులై 21 నాటికి, అమెరికా కనీసం పది విడతల దాడులు నిర్వహించింది. వాటిలో ఇటీవలి దాడులలో, సైనిక స్థావరాలను దాటి ఇరాన్‌లోని వంతెనలు, ఒక విమానాశ్రయం, విద్యుత్ మౌలిక సదుపాయాలపై కూడా దాడి చేసింది. ఇవి ట్రంప్ గతంలో బెదిరించిన పౌర లక్ష్యాలు. ఇరాన్ కూడా తన ప్రతీకారాన్ని విస్తరించింది. అది కువైట్‌లోని ఒక విద్యుత్, డీశాలినేషన్ ప్లాంట్‌పై, బహ్రెయిన్ పెట్రోలియం కంపెనీ (బాప్కో) చమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేసింది. జులై 17న జోర్డాన్‌లోని ఒక సైనిక స్థావరంపై దాడి చేయగా, ఇద్దరు అమెరికా సైనికులు మరణించారు, మూడవ వ్యక్తి ఆచూకీ తెలియకుండా పోయింది. టెహ్రాన్ జులై 13న సౌదీ అరేబియాపై, మళ్ళీ జులై 17న ప్రిన్స్‌సుల్తాన్ ఎయిర్ బేస్‌పై క్షిపణులను ప్రయోగించగా, తూర్పు సిరియాలోని ఒక అమెరికా కమాండ్ పోస్ట్‌పై తమ మొదటి దాడి చేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కారప్స్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. యెమెన్‌లో, తమ నియంత్రణలో ఉన్న విమానాశ్రయంపై రియాద్ బాంబు దాడి చేసిందని ఆరోపిస్తూ హౌతీలు సౌదీ అరేబియాపై తమ ప్రతి క్షిపణి దాడిని ప్రారంభించారు. దీంతో నాలుగేళ్ల కాల్పుల విరమణ ముగిసింది.విస్తరిస్తున్న సౌదీ కూటమి పాకిస్తాన్‌ను ఈ వివాదంలోకి లాగింది. గత సెప్టెంబర్‌లో రియాద్‌తో కుదుర్చుకున్న పరస్పర రక్షణ ఒప్పందం ప్రకారం, సౌదీ రాజ్యంపై ఇరాన్ గానీ, హౌతీలు గానీ చేసే ఏ తదుపరి దాడినైనా పాకిస్తాన్‌పై జరిగిన దాడిగానే పరిగణిస్తామని పాకిస్తాన్ ఇరాన్‌ను హెచ్చరించింది. ఇదిలా ఉండగా, ఈ యుద్ధం జరుగుతున్నంత కాలం ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇజ్రాయెల్‌పై తన బహిరంగ విమర్శలను మరింత తీవ్రతరం చేశారు. జూన్‌లో కాల్పుల విరమణ కొనసాగినప్పుడు, వాషింగ్టన్ ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలను ఒక పరిష్కారానికి మద్దతుగా నిలపడానికి కృషి చేస్తున్నప్పుడు, పురోగమిస్తున్నట్లు కనిపించిన దౌత్యంలో చాలా వరకు ఈ పరిణామాల వల్ల దెబ్బతిన్నాయి. జూన్ చివరిలో, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, బహ్రెయిన్‌లలో మూడు రోజుల పర్యటన జరిపారు.జూన్ 25న విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో, అమెరికా, ఆరుగురు సభ్యుల గల్ఫ్ సహకార మండలి, శాశ్వత శాంతి కోసం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లు, ప్రాక్సీ గ్రూపులకు మద్దతు వంటి సమస్యలను పరిష్కరించడంతో పాటు, హర్మూజ్ జలసంధిలో 'ఎటువంటి సుంకాలు, రుసుములు లేదా నియంత్రణను స్థాపించే ప్రయత్నాలు లేకుండా 'స్వేచ్ఛాయుత, షరతులు లేని, అనియంత్రిత నౌకాయానానికి' మద్దతు ఇవ్వాలని పేర్కొన్నాయి. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ అరబ్ దేశాలు ఇస్లామిక్ రిపబ్లిక్‌తో శాశ్వత రాజీ దిశగా పయనించడంపై గణనీయమైన చర్చ జరిగింది. అయినప్పటికీ, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, ఇతర గల్ఫ్ దేశాలు అటువంటి సమతుల్యతను సమగ్రమైన లేదా స్థిరమైన రూపంలో కొనసాగించగలవని భావించడం కష్టం. మరింత సహేతుకంగా చెప్పాలంటే, ఈ ఇంధన- ఎగుమతి దేశాలు ఇరాన్ సవాలును పరిష్కరించడం కంటే, దానిని నిర్వహించే వ్యూహాలనే అనుసరిస్తాయి.ముఖ్యంగా, క్షిపణి, డ్రోన్ సామర్థ్యాల ద్వారా ఇరాన్ తమను నేరుగా బెదిరించగల పరిస్థితులలో ఇది జరుగుతుంది. ఇటువంటి విధానం ప్రాంతీయ వ్యూహాత్మక వాతావరణంలో జరుగుతున్న విస్తృత పరివర్తనకు అనుగుణంగా ఉంది. ఈ పరివర్తనలో యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్, టర్కీ, పాకిస్తాన్ దేశాలు క్రమంగా మరింత విచ్ఛిన్నమైన శక్తి సమతుల్యతను రూపొందిస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా–, ఇజ్రాయెల్ వైమానిక దాడులు గల్ఫ్ అరబ్ దేశాలు చాలాకాలంగా భయపడుతున్న విషయాన్ని ధ్రువీకరించాయి: ఇరాన్‌తో ఎలాంటి పెద్ద ఎత్తున సంఘర్షణ జరిగినా, దాని ఫలితం ఎలా ఉన్నా, అది వారి సొంత భద్రత, ఆర్థిక వ్యవస్థలు, రాజకీయ స్థిరత్వంపై భారీ మూల్యం చెల్లించేలా చేస్తుంది. అయినప్పటికీ, ఈ వాస్తవం ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక వైరుధ్యాన్ని నొక్కి చెబుతోంది: గల్ఫ్ దేశాలు అమెరికాతో సన్నిహిత పొత్తు ద్వారా, ఇటీవల, అబ్రహం ఒప్పందాల కింద ఇజ్రాయెల్‌తో భద్రతా సంబంధాలను విస్తరించడం ద్వారా ఇరాన్ శక్తిని నియంత్రించడానికి ప్రయత్నించినప్పటికీ, ఇరాన్ ప్రతీకార చర్యలకు తామే ఎక్కువగా గురవుతామని కూడా అవి అర్థం చేసుకున్నాయి. 2015 అణు ఒప్పందంపై వారిలో నెలకొన్న తీవ్ర ఆందోళనలోనే ఈ ఉద్రిక్తత అప్పటికే స్పష్టంగా కనిపించింది. ఆ ఒప్పందం ఇరాన్ ప్రాంతీయ ఆకాంక్షలను తగినంతగా అరికట్టకుండా, దానిని ఆర్థికంగా బలోపేతం చేస్తుందని వారు భయపడ్డారు. అదే సమయంలో, దౌత్యం విఫలమైతే యుద్ధం జరిగే అవకాశాలు మరింత పెరుగుతాయని కూడా వారు గుర్తించారు. దీని ఫలితంగా ఒక నిరంతర వ్యూహాత్మక సందిగ్ధత ఏర్పడింది. దీనిలో గల్ఫ్ అరబ్ దేశాలు, ఇరాన్‌ను కట్టడి చేయడంతోపాటు, దానితో జరిగే ఏ ఘర్షణలోనైనా తామే ప్రధాన యుద్ధభూమిగా మారకుండా ఉండేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి.అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడితో రేగిన ప్రాంతీయ యుద్ధం, ఇజ్రాయెల్‌తో సంబంధాలను మరింత లోతుగా సాధారణీకరించే దిశగా సాగుతున్న క్రమమైన ప్రస్థానానికి అంతరాయం కలిగించి, గల్ఫ్ అరబ్ దేశాల వ్యూహాత్మక లెక్కలను మౌలికంగా సంక్లిష్టం చేసింది. గల్ఫ్ రాచరిక దేశాలు మొదట్లో హమాస్‌పై ఇజ్రాయెల్ సాగించిన పోరాటాన్ని, ఆ తర్వాత ఇరాన్ ప్రాంతీయ ప్రాక్సీని క్రమపద్ధతిలో బలహీనపరచడాన్ని ఒక తీవ్రమైన వైఖరిగా చూశాయి.ట్రంప్ పరిపాలన ప్రాథమిక ప్రణాళికలో ఇరాన్ కోసం 300 బిలియన్ డాలర్ల పునర్నిర్మాణ నిధిని ప్రతిపాదించారు. ఆర్థిక స్థిరీకరణను కేవలం టెహ్రాన్‌కు ఒక ప్రలోభంగానే కాకుండా, మరింత నిర్వహించదగిన ప్రాంతీయ సమతుల్యత కోసం చేసే పెట్టుబడిగా కూడా పరిగణిస్తున్నారు. చూస్తే గల్ఫ్ అరబ్ దేశాలు తమ ప్రధాన ప్రాంతీయ శత్రువు పునర్నిర్మాణానికి నిధులు సమకూరుస్తాయనే భావన అసంబద్ధంగా అనిపిస్తుంది. అయినప్పటికీ, వారి దృక్కోణంనుండి చూస్తే, పరోక్ష యుద్ధం, క్షిపణి వ్యాప్తి, దీర్ఘకాలిక ప్రాంతీయ అస్థిరతపై ఆధారపడిన విప్లవ రాజ్యం కొనసాగడం కంటే, ఇరాన్ ఆర్థిక పునరేకీకరణకు ఆర్థిక సహాయం అందించడమే తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావచ్చు.అంతిమంగా, గల్ఫ్ భవిష్యత్ భద్రతా నిర్మాణం, ఇరాన్‌తో కుదిరే ఏదైనా ఒప్పందం కచ్చితమైన రూపురేఖల కంటే, అమెరికా ఆవిర్భవిస్తున్న ప్రాంతీయ బాధ్యతల పంపిణీ బృహత్ వ్యూహం కింద విస్తృత మధ్యప్రాచ్యం ఎలా పునర్వ్యవస్థీకరించబడుతుందనే దానిపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. పరిణామం చెందుతున్న ఆ చట్రంలో, సుదీర్ఘమైన, అనిశ్చితమైన అంతర్గత పరివర్తనకు లోనయ్యే అవకాశం ఉన్న ఇరాన్‌ను నిర్వహించే బాధ్యతను టర్కీ, సౌదీ అరేబియా, ఇప్పుడు పాకిస్తాన్‌లపై పడుతుంది. వీటికి ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈజిప్ట్, అజర్‌బైజాన్ కూడా మద్దతు ఇస్తున్నాయి.

# అర్హతలున్నా దక్కని పదోన్నతి స్కేళ్లు!



హైదరాబాద్,ప్రభుత్వ ఉత్తర్వులు ఎంత స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను, పదోన్నతులను సకాలంలో పొందలేకపోతున్నారు. ముఖ్యంగా 45 సంవత్సరాల వయసు దాటినప్పటికీ, డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాస్ కాలేదనే నెపంతో ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో 12 ఏళ్ల యాంత్రిక పదోన్నతి స్కేలు మంజూరుకు నోచుకోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో మంది ఉన్నారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.225 (జీఏడీ), తేదీ: 18.05.1999, జీవో నెం.96 (ఫైనాన్స్), తేదీ: 20.05.2011ల ప్రకారం... 45 ఏళ్ల వయసు దాటిన వారికి డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణత నుండి స్పష్టమైన మినహాయింపు ఉంది. ఎప్పుడో జారీ అయినా ఈ జీవోలపై అధికారులకు అవగాహన కొరవడడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారింది.

### జీవో 225 ఏం చెబుతోందంటే..!?

తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996 లేదా ఇతర ప్రత్యేక, తాత్కాలిక నిబంధనలతో సంబంధం లేకుండా, 45 ఏళ్ల వయసు దాటిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మొదటి నియామకం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఒక్క ప్రమోషన్ కూడా పొందకపోతే, తదుపరి ఉన్నత పోస్టు ప్రమోషన్ పొందేందుకు డిపార్ట్‌మెంటల్ టెస్టుల ఉత్తీర్ణత నుండి జీవో 225 ద్వారా మూడు షరతులకు లోబడి శాశ్వత మినహాయింపు లభిస్తుంది. ఫస్ట్ షరతు ఏంటంటే, మొదటి ప్రమోషన్‌కు మాత్రమే మినహాయింపు వర్తిస్తుంది. ఇప్పటికే ఒకసారి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు లేని పోస్టులోకి ప్రమోషన్ పొంది ఉంటే, ఆపై పోస్టుకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు తప్పనిసరి అయితే ఈ మినహాయింపు వర్తించదు. అకడమిక్ అర్హతలకు మినహాయింపు వర్తించదనేది రెండవ నిబంధన. ఈ మినహాయింపు కేవలం డిపార్ట్‌మెంటల్ లేదా స్పెషల్ టెస్టులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రమోషన్ పోస్టుకు అవసరమైన సాంకేతిక లేదా అకాడమిక్ విద్యార్హతలకు మాత్రం ఈ మినహాయింపు వర్తించదు. అవి తప్పనిసరిగా ఉండాలి. ప్రొబేషన్ డిక్లరేషన్‌కు వర్తించదనేది మూడో కండిషన్.

### ఎస్ఏలకు గెజిటెడ్ హెచ్ఎం ప్రమోషన్లు!

విద్యాశాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా చేరి, 45 ఏళ్ల వయసు దాటిన వారికి ఈ 225 జీవో ఒక సంజీవని లాంటిది. వీరికి అకడమిక్ విద్యార్హతలైన డిగ్రీ, బీఈడీ/పండిట్ ట్రైనింగ్/బీపీఈడీ మొదలైనవి ఉండి, డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాస్ కాకపోయినా, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలని జీవో 225 నిర్దేశిస్తోంది. అదేవిధంగా, స్కూల్ అసిస్టెంట్‌గా నేరుగా నియామకమై, 45 ఏళ్ల వయసు దాటి 12 సంవత్సరాల సర్వీసు పూర్తి కాగానే 12 ఏళ్ల యాంత్రిక పదోన్నతి స్కేలును సైతం ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే మంజూరు చేయాలి.

### మోడల్ స్కూల్ టీచర్లకూ వర్తింపు

ఈ నిబంధనలు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సైతం వర్తిస్తాయి. మోడల్ స్కూళ్లల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్, టీజీటీ, పీజీటీలకు 45 ఏళ్ల వయసు దాటి, ఒకే పోస్టులో 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేస్తే, డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణతతో నిమిత్తం లేకుండా వారికి 12 సంవత్సరాల స్కేలును విధిగా మంజూరు చేయాలి. ప్రభుత్వ నిబంధనలు ఇంత స్పష్టంగా, పారదర్శకంగా ఉన్నా వాటిని అమలు చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడం సమర్థనీయం కాదు. అర్హులైన ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ వయోపరిమితి ఆధారంగా రావాల్సిన రెగ్యులర్ ప్రమోషన్లను, 12 ఏళ్ల యాంత్రిక పదోన్నతి స్కేల్‌ను అధికారుల దయాదాక్షిణ్యాలకు వదిలేయకుండా, ఒక హక్కుగా పోరాడి సాధించుకోవాలి. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 225, 96లను అర్హులైన వారికి సత్వరం అమలు చేసి న్యాయం చేయాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

## మార్కాపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

మార్కాపురం మండలం తిప్పాపాలెం ? చింతకుంట్ల గ్రామాల మధ్య ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న బొలెరో కారు ప్రమాదానికి గురికావడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కారులో ఇరుక్కుపోయాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు.

## ఢిల్లీ నేతల అపాయింట్ మెంట్ కోరిన జగన్

విజయవాడ, మద్యం కుంభకోణం ఏపీలో ప్రకంపనలు సృష్టించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో భారీ కుంభకోణం జరిగింది. అయితే దీనిపై ఏర్పాటైన సీట్ విచారణ తుది దశకు వచ్చింది. అంతిమ లబ్ధిదారుడు ఎవరు అనే దానిపై ఒక క్లారిటీ వచ్చింది. ప్రధానంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని విచారించేందుకు ఈడి రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో నోటీసులు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. అదే జరిగితే ఈ కేసు తుది దశకు వచ్చినట్టే. జగన్మోహన్ రెడ్డి భయం కూడా అదే. అందుకే ఇప్పుడు ఆయన కేంద్ర పెద్దలను ఆశ్రయించినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో దాదాపు 3800 కోట్ల రూపాయల మద్యం కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇది అధికారికంగా మాత్రమే. అనధికారికంగా అంతకుమించి అన్నట్టు పరిస్థితి ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఎలాంటి ఆర్థిక వ్యవహారాలు అయినా డిజిటల్ లావాదేవీల రూపంలో జరుగుతున్నాయి. అటువంటిది వైసిపి హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు జరగలేదు. దీని వెనుక భారీగా మతలబు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఈడి రంగప్రవేశం చేసింది. అయితే ఇప్పుడు అదే ఈడి ఏకంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి విచారణకు పిలిచేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే జగన్మోహన్ రెడ్డికి చిక్కులు తప్పేలా లేవుప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దలను ఆశ్రయించినట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీతో పాటు అమిత్ షా అపాయింట్మెంట్ కోరినట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణంలో ఎప్పుడైతే ఈడి ప్రవేశం ముందు అప్పటినుంచి జగన్ లో ఒక రకమైన భయం ఏర్పడింది. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ విచారణకు ఆదేశించింది. అయితే అది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో.. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగం అని ప్రచారం సాగింది. కానీ ఇందులో కీలకమైన ఆర్థిక ఆధారాలు, రుజువులు దొరకడంతో ఈడి ఎంట్రీ ఇచ్చింది. అప్పటినుంచి జగన్మోహన్ రెడ్డిలో భయం ప్రారంభమైనట్లు తెలుస్తోంది.. అందుకే కేంద్ర పెద్దలను ఆశ్రయించినట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## వరుస తప్పులతో ఉదయ్ కృష్ణారెడ్డి

ఒంగోలు, హైదరాబాద్, ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ కాంపిటీటర్లకు ఆదర్శంగా నిలిచి, శ్రమించి సాధించిన విజయాన్ని ఒక క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లాల్సిన ఒక ఐపీఎస్ ట్రైనీ అధికారి.. వ్యక్తిగత ప్రవర్తనా లోపాలు, విలువలేని నిర్ణయాలతో తన చేజేతులా కెరీర్‌ను నాశనం చేసుకున్న ఆశ్చర్యపరుస్తోంది. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో వెలుగు చూసిన వరుస పరిణామాలు, సహ-ట్రైనీతో వివాదం , ఆ తర్వాత చోటుచేసుకున్న డ్రామాలు ఆయన తీవ్రమైన నైతిక పతనానికి నిదర్శనంగా నిలిచాయి. ఉన్నతమైన స్థానానికి చేరుకున్న తొలి మెట్టులోనే నైతికంగా దృఢంగా నిలబడాల్సింది పోయి, ప్రవర్తనా నియమావళిని విస్మరించడం వల్లనే ఈ పరిణామాలు పీకల మీదకు వచ్చాయి.తోటి వివాహిత ట్రైనీ ఐపీఎస్ అధికారితో ఉన్న వ్యక్తిగత సంబంధం బెడిసికొట్టడం, దానిపై పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కేంతగా విభేదాలు రావడం ఒక ఎత్తయితే.. ఆ తర్వాత ఆయన ప్రదర్శించిన వైఖరి మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేయడం, లీగల్ నోటీసులకు విరుద్ధంగా వ్యవహరించడం , సింపతీ పొందడానికి ఆత్మహత్యాయత్నం నాటకాలు ఆడటం వంటి చర్యలు సర్వీస్ నిబంధనలకు సంపూర్ణంగా విరుద్ధం. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పరం మాట్లాడుకుని సర్దుబాటు చేసుకోవాల్సిన లేదా చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను రోడ్డున పడేసి, రచ్చ చేసుకోవడం ద్వారా ఉదయ్ కృష్ణారెడ్డి తన ప్రొఫెషనలిజాన్ని గాలికి వదిలేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.భారత సివిల్ సర్వీసెస్‌లో పనిచేసే అధికారులకు నైతికత , ఆత్మనిగ్రహం, భావోద్వేగ నియంత్రణ అత్యంత కీలకమైన అంశాలు. బాధ్యతాయుతమైన ఐపీఎస్ అధికారిగా దేశానికి సేవ చేయాల్సిన వ్యక్తి, ట్రైనింగ్ దశలోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు, నైతిక లోపాలు ఎదుర్కొని కేంద్ర హోంశాఖ ద్వారా సస్పెన్షన్‌కు గురికావడం ఒక రకంగా వ్యవస్థాత్మక వైఫల్యాన్ని కూడా ఎత్తిచూపుతోంది. విజయం నెత్తికెక్కించుకోకుండా, తన లక్ష్యాన్ని, రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలను నిరంతరం గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాల్సిన ఉదయ్ కృష్ణారెడ్డి.. తప్పు మీద తప్పు చేస్తూ తన కెరీర్‌ను రిస్కులో పెట్టుకున్నారుఇప్పుడు ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ తీసుకున్న కఠిన చర్యల వల్ల ఆయనకు తన తప్పులను దిద్దుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఐపీఎస్ స్థాయికి ఎదిగినప్పటికీ వ్యక్తిగత జీవితంలో నియంత్రణ, బాధ్యత లోపిస్తే ఎంతటి ఉన్నతమైన కెరీర్ అయినా క్షణాల్లో తుడిచిపెట్టుకుపోతుందనడానికి ఈ సంఘటన ఒక బలమైన హెచ్చరిక. సివిల్ సర్వీసెస్ సాధించాలనుకునే వేలాది మంది యువతకు ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతం ఒక పాఠంగా నిలవనుంది. సామర్థ్యం ఎంత ముఖ్యమో, వృత్తిపరమైన, వ్యక్తిగత నైతికత అంతకంటే ముఖ్యం. విజయం మత్తులో ఉదయ్ దీన్ని మర్చిపోయారు. కోల్పోయారు.

## ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్ గా భోగాపురం ఎయిర్ పోర్టు

అమరావతి,భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్సునిర్వహించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్సులో మాట్లాడారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయ్యే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్ గా మారుతుందని ముఖ్యమంత్రి అన్నారు.టెలికాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగేలా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేశాం. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రతి పౌరుడ్నీ భాగస్వామిని చేయాలి. ఉత్తరాంధ్రకు మణిహారంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుందని అన్నారు. ఆగస్టు 1వ తేదీన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఎయిర్ పోర్టు పాసింజర్ టెర్మినల్ , ఏవియేషన్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్, ఎడ్యుసిటీలను ప్రారంభించుకోబోతున్నాం . అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించుకోవాలి. అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఏపీకి ఓ లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి ఇది ఓ గేమ్ చేంజర్. ఎయిర్ పోర్టుతో పాటు ఏఐ డేటా సెంటర్లు, రేర్ ఎర్త్ మినరల్స్ లాంటి ఖనిజాలు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మారుస్తాయి. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు టేకాఫ్ అయితే ఉత్తరాంధ్రతో పాటు యావత్ రాష్ట్రానికి కీలక ప్రాజెక్టుగా మారుతుంది. ఈ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులను, యజమానుల్ని గౌరవిస్తూ ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తున్నాం. వచ్చే 9 రోజుల పాటు ఉత్తరాంధ్రలోని ప్రతీ ఇంటా ప్రారంభోత్సవ వేడుక స్ఫూర్తి చేరాలి. ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించే బాధ్యత తీసుకోవాలి. అరకు కాఫీ, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలు, స్థానిక కళారూపాలను కూడా ఘనంగా ప్రదర్శిద్దాం. విశాఖ ఎకనామిక్ రీజియన్ లో భోగాపురం ఎయిర్ పోర్టు ఎంతటి కీలకమైన పాత్రపోషిస్తుందో ప్రజలకు

# మల్లారెడ్డికి రక్తంతో లేఖ.. తీవ్ర కలకలం



హైదరాబాద్,మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఓ పార్టీ కార్యకర్త తన సొంత రక్తంతో లేఖ రాయడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో.. ముఖ్యంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ పట్ల తనకున్న ఆవేదనను వ్యక్తం చేస్తూ సదరు కార్యకర్త రాసిన ఈ లేఖ ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా విపరీతంగా వైరల్ అవుతోంది.

లేఖలో కార్యకర్త ఆవేదన.. ఆరోపణలు

పార్టీ కోసం రక్తం చిందించే కార్యకర్తలను విస్మరిస్తున్నారంటూ సదరు కార్యకర్త ఈ లేఖ ద్వారా తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో ఎంతో చురుగ్గా వ్యవహరించిన మల్లారెడ్డి, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్న క్లిష్ట సమయంలో మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా ప్రత్యర్థి పార్టీల నేతల వేదికలపై కనిపించడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న లక్షలాది మంది కార్యకర్తల్లో తప్పు సంకేతాలు వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను తన విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగుల మాదిరిగా చూస్తున్నారని.. ధన అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని సదరు కార్యకర్త ఆరోపించారు. నాయకులు కార్యకర్తలకు అండగా నిలవాల్సింది పోయి, ఇలా వ్యవహరించడం వల్ల పార్టీ తీవ్రంగా బలహీనపడుతుందని లేఖలో పేర్కొన్నారు. "బీఆర్ఎస్ అనేది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి పార్టీ సిద్ధాంతాలను, కార్యకర్తలను మరచిపోయిన ఏ నాయకుడైనా కాలక్రమేణా చరిత్రలో కనుమరుగైపోవడం ఖాయం" అని తీవ్రంగా హెచ్చరించారు. "ఈ లేఖను నా రక్తంతో రాయడం వెనుక ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదు. కేవలం పార్టీపై ఉన్న ప్రేమ, ఒక కార్యకర్తగా నా మనసులోని బాధ, ఆవేదన మాత్రమే కారణం." అని బీఆర్ఎస్ కార్యకర్త లేఖ రాశారు.

నెట్టింట వైరల్.. ఇంకా మౌనంలోనే మల్లారెడ్డి

తెలంగాణ కోసం, పార్టీ కోసం త్యాగాలు చేసిన కార్యకర్తల భావోద్వేగాలను బీఆర్ఎస్ అధిష్ఠానం మరియు సీనియర్ నాయకులు గౌరవించాలని, పార్టీని మళ్లీ బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని కార్యకర్త విజ్ఞప్తి చేశారు. కాగా ఈ రక్తపు లేఖ ఘటనతో బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాల్లో పెద్ద ఎత్తున కలకలం రేగింది. ఈ విషయంపై సోషల్ మీడియాలో నేతలు, నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ లేఖపై ఇప్పటివరకు మాజీ మంత్రి మల్లారెడ్డి గానీ, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకత్వం గానీ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం.

# ప్రశ్నించే గొంతులు ఏమయ్యాయి?



అమరావతి,నీట్ ప్రశ్నపత్రం లీక్, అనంతర పరిణామాలపై వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సీరియస్ కామెంట్లు చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ పై జాతీయస్థాయిలో నిరసనలు జరుగుతుంటే, మన ఏరియా (రాష్ట్రం)లో ఎందుకు అలాంటి నిరసనలు జరగడం లేదో తనకు అర్థం కావడం లేదంటూ కేతిరెడ్డి వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మన వాళ్లకు బెనిఫిట్ షోలపై చూపినంత ఉత్సాహం, నీట్, సీబీఎస్ఈ ప్రశ్నపత్రాల లీక్ అయినప్పుడు చూపించడం లేదంటూ విచారం వ్యక్తం చేశారు. నీట్ పై ప్రత్యేకంగా కేతిరెడ్డి మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.నీట్ పరీక్షపై కేతిరెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. కేవలం 30 సెకన్ల వీడియోలో ఆయన మాట్లాడిన మాటలు అందరినీ ఆలోచనకు గురిచేస్తున్నాయని అంటున్నారు. దీంతో కేతిరెడ్డి వీడియోను సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేస్తున్నారు. నేను మాట్లాడతాను, ప్రశ్నిస్తాను అన్నవారు కూడా ఈ విషయంలో ప్రశ్నించడం లేదని కేతిరెడ్డి ఆరోపించారు. బెనిఫిట్ షోలపై చూపుతున్న ఉత్సాహం పేపర్ లీకేజీపై ఉండటం లేదని కేతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.కాగా, కేతిరెడ్డి తన వీడియోలో ఏ రాజకీయ పార్టీ, నాయకుడి పేరు ప్రస్తావించకపోయినా, జాతీయ స్థాయి పరీక్షల వైఫల్యంపై ఉప ముఖ్యమంత్రి పవన్ మాట్లాడకపోవడాన్ని పరోక్షంగా నిలదీశారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. తప్పు జరిగితే ప్రశ్నిస్తానంటూ చెప్పే పవన్ మాటలను ఉటంకిస్తూ 'ప్రశ్నించే గొంతు' ఏమైందంటూ కేతిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించినట్లు భావిస్తున్నారు. కేతిరెడ్డి ఏ ఉద్దేశంతో వీడియో చేసినా, ప్రస్తుత పరిస్థితులకు తగినట్టు ఆయన మాట్లాడరని, అందుకే నెటిజన్లు విపరీతంగా ఆకట్టుకుంటోందని అంటున్నారు.నీట్ ప్రశ్నపత్రం లీకైన తర్వాత రీనీట్ నిర్వహించడం, దాని ఫలితాలు వెల్లడైనా 'కాక్రోచ్ పార్టీ' ఆందోళనలతో నీట్ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదని అంటున్నారు. అంతేకాకుండా గత రెండు రోజులుగా నీట్ లీకేజీనే జాతీయస్థాయిలో ప్రధాన చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. 20వ తేదీన నీట్ పరీక్ష వైఫల్యాన్ని నిరసిస్తూ కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించగా, 21న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ నివాసం ఎదుట మెరుపు ధర్నా జరిగింది. దీంతో ప్రస్తుతం ఏ నోట విన్నా నీట్ పైనే చర్చ జరుగుతోంది.అయితే జాతీయ స్థాయిలో విస్తృత చర్చ జరుగుతున్న ఈ అంశంపై రాష్ట్రంలో ఏ ఒక్కరూ మాట్లాడకపోవడాన్ని ఎత్తిచూపుతూ కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని అంటున్నారు. అయితే రాష్ట్రంలో అధికార పక్షంలోని ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించకపోవడం ఏంటంటూ కేతిరెడ్డి విమర్శలు దిగితే, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని నెటిజన్లు ఎత్తిచూపుతున్నారు. ఏదిఏమైనా కేతిరెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టు ఉండటంతో ఆయన ఒక్కసారిగా ట్రెండింగ్ లోకి వచ్చారని వ్యాఖ్యానిస్తున్నారు.

# పాపం బీఆర్ఎస్,వైసీపీ - గొంతెత్తలేవు !

హైదరాబాద్,రాజకీయాల్లో ఏ పార్టీకైనా భవిష్యత్తు ఉండాలంటే ఎదురునిలిచి పోరాడే తత్వం ఉండాలి. ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని సూటిగా నిలదీసినప్పుడే ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుంది. కానీ, ప్రస్తుత తెలుగు రాష్ట్రాల రాజకీయంలో ఒక చిత్రమైన, ఆందోళనకరమైన పరిస్థితి కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ, పరీక్షల కుంభకోణంపై విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు ఆంధ్రప్రదేశ్‌లోని వైయస్సార్‌సీపీ , తెలంగాణలోని భారత్ రాష్ట్ర సమితి మాత్రం ఎవరికీ వినపడీ వినపడనట్లు నసుగుతున్నాయి. విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఇంతటి సున్నితమైన అంశంపై కూడా ఈ రెండు పార్టీలు గొంతెత్తి గట్టిగా మాట్లాడలేకపోవడం వెనుక పెద్ద రాజకీయ భయమే దాగి ఉందనే ఉంది.

బీజేపీపై కత్తిదూయలేని నిస్సహాయత

ఈ రెండు పార్టీల మౌనం వెనుక ఉన్న ప్రధాన కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీపై ఉన్న భయమే. బీజేపీ పెద్దలకు కోపం వస్తే తమ రాజకీయ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందనే నైరాశ్యంలో ఈ పార్టీలు కొట్టుమిట్టాడుతున్నాయి. తెలంగాణలో ఓటమి తర్వాత బీఆర్ఎస్, ఏపీలో ఘోర పరాజయం తర్వాత వైయస్సార్‌సీపీ తీవ్రమైన రక్షణాత్మక వైఖరిలోకి వెళ్లిపోయాయి. గతంలో చేసిన పద్ధతులు, సీబీఐ, ఈడీ, ఐటీ దర్యాప్తులు లేదా చట్టపరమైన కేసులు తమ మెడకు చుట్టుకుంటాయనే ఆందోళనతో, కేంద్రంలో ఉన్న పెద్దలను ప్రసన్నం చేసుకోవడమే పరమావధిగా ఇరు పార్టీల నాయకత్వాలు వ్యవహరిస్తున్నాయి.

బీజేపీతో పొత్తులు పెట్టుకోలేవు - సామంత పార్టీలుగా ఉండాల్సిందే!

ఇక్కడే ఈ రెండు పార్టీల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఇటు వైయస్సార్‌సీపీ కానీ, అటు బీఆర్ఎస్ కానీ ప్రత్యక్షంగా బీజేపీతో అధికారిక పొత్తులు పెట్టుకోలేని పరిస్థితి. తెలంగాణలో కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా బలమైన శక్తిగా ఎదిగిన వేళ, బీఆర్ఎస్ బీజేపీకి లొంగిపోయినట్లు కనిపించే ప్రతి నిర్ణయం ఆ పార్టీ కేడర్‌ను పూర్తిగా నీరుగారుస్తోంది. అటు ఏపీలో ఇప్పటికే బీజేపీ, టిడిపి, జనసేన కూటమి అధికారంలో ఉంది. ఇలాంటి సమయంలో వైయస్సార్‌సీపీ బీజేపీకి భయపడుతూ విపక్ష పాత్రను సరిగా పోషించకపోతే, రాష్ట్రంలో విపక్షంగా తన స్థానాన్ని కాపాడుకోవడం కూడా కష్టసాధ్యమే అవుతుంది.

పోరాడితేనే ప్రజాస్వామ్యంలో విజయం

ప్రజాస్వామ్యంలో తిరగబడే నైజం కోల్పోయిన పార్టీలకు సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తు ఉండదనేది చరిత్ర చెప్పే సత్యం. కేంద్రానికి కోపం రాకూడదు, అదే సమయంలో విపక్షంగా ఉన్నామని చెప్పుకోవడానికి నాలుగు ప్రకటనలు పడేయాలి అనే ఈ నసుగుడు రాజకీయం ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది. విద్యార్థుల నిరసనలకు పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించలేక, కాంగ్రెస్ నడుపుతున్న జాతీయస్థాయి ఆందోళనల్లో భాగస్వామ్యం కాలేకపోవడం వల్ల ఈ రెండు పార్టీలూ సైద్ధాంతికంగా తీవ్రమైన అయోమయంలో పడిపోయాయి. తమ సొంత ఉనికిని కాపాడుకోవడానికే నిరంతరం తాపత్రయపడే నాయకత్వాలను చూసి ద్వితీయ శ్రేణి నాయకులు, శ్రేణులు నిరాశలో కూరుకుపోతున్నాయి. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని అధికార పక్షాలను డిఫెన్స్‌లో పడేయాల్సిన విపక్షాలు, తమపై ఏవైనా చర్యలు ఉంటాయేమోనని తామే స్వయంగా డిఫెన్సివ్ మోడ్‌లోకి వెళ్లడం ఆయా పార్టీల బలహీనతను స్పష్టంగా సూచిస్తోంది.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్‌సీపీ, బీఆర్ఎస్‌లు తమ వ్యూహాన్ని మార్చుకోకపోతే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. బీజేపీ భయాన్ని పక్కనపెట్టి, ప్రజా సమస్యలపై నికరంగా నిలబడి పోరాడినప్పుడే ఏ పార్టీకైనా మళ్లీ పూర్వవైభవం సాధ్యమవుతుంది. పొత్తులు పెట్టుకోలేక, పోరాటాలు చేయలేక రెండు పడవలపై ప్రయాణం చేస్తున్న ఈ భయపడే రాజకీయం ఆ పార్టీలను రాజకీయంగా మరింత క్షీణింపజేస్తుందే తప్ప, ఏ రకమైన మైలేజీని ఇవ్వదు.

# డాక్యుమెంట్ రైటర్లదే హవా!



వరంగల్ : ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికీ భూముల రిజిస్ట్రేషన్ లో మార్పు లేదు. నేటికీ బ్రోకర్ల ప్రమేయమే కొనసాగుతోంది. అంతా ఆన్ లైన్ అయినా వారు లేనిదే ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారి నుంచి వేల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. బ్రోకర్లు లేకుండా రిజిస్ట్రేషన్ కోసం నేరుగా వెళ్లే వారికి ఏదోక కొర్రీ పెడుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరిగినా, అధికారులను సస్పెండ్ చేసిన మార్పు మాత్రం లేదు. కొత్త వారిని నియమించినా ఇప్పటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లే చక్రం తిప్పుతున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇళ్లు, భూములు, ప్లాట్స్, మార్టిగేజ్, ఇతర రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నిత్యం వందల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. చార్జీల రూపంలో ప్రభుత్వానికి ప్రతినెల కోట్ల రూపాయలు వస్తున్నాయి. గడిచిన కొన్నేళ్లుగా రిజిస్ట్రేషన్లు అన్నీ ఆన్ లైన్లో జరుగుతున్నాయి. భూముల కొనుగోలు, క్రయవిక్రయాలు అన్ని రిజిస్ట్రేషన్లు ఆన్ లైన్ లో జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఆన్ లైన్ ఎంట్రీ చేసి ఫీజులు చెల్లించి స్లాట్ బుక్ చేస్తే ఆ రోజు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ కు ముందు రిజిస్ట్రేషన్లు మాన్యువల్ గా జరిగేవి. అప్పుడు అంతా డాక్యుమెంట్లు డాక్యుమెంట్ రైటర్ల ఆధ్వర్యంలో జరిగేవి. వారికి కమిషన్ ఇచ్చేవారు. ఆన్ లైన్ వచ్చిన తర్వాత డాక్యుమెంట్ రైటర్లకు పనిలేకుండా పోయింది. ప్రభుత్వం వారిని ఎత్తివేసింది.అయినా ఇప్పటికీ వారు లేనిదే పని కావడం లేదు. ప్రతి డాక్యుమెంట్ వారి ద్వారానే చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లు కూడా వారితో లోపాయికరి ఒప్పందం చేసుకున్నారు. డాక్యుమెంట్ విలువ ను బట్టి కమిషన్ వసూలు చేస్తున్నారు. నిత్యం వేల రూపాయలు సంపాదిస్తున్నారు. అధికారులకు వాటా ఇస్తూ యథేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. హన్మకొండ లోని వడ్డెపల్లి, ఖిల్లా వరంగల్, వరంగల్ రూరల్, భీమదేవరపల్లి, స్టేషన్ ఘన్?పూర్, జనగామ, నర్సంపేట, వర్ధన్నపేట, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, పరకాలలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి చుట్టూ ఎక్కడ చూసినా డాక్యుమెంట్?రైటర్ల షాపులు దర్శనమిస్తాయి. వీటి ద్వారానే డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

ఏసీబీ దాడులు జరిగినా మారని తీరు..

హన్మకొండ వడ్డెపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు నెలల క్రితం ఏసీబీ దాడులు చేయడంతో పాటు ఇద్దరు అధికారులను పట్టుకున్నారు. కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ పూర్తయిన 250 డాక్యుమెంట్లు వారి వద్దనే ఉంచుకున్నట్లు ప్రభుత్వానికి నివేదించారు. వారి స్థానంలో కొత్త సబ్ రిజిస్ట్రార్లను నియమించిన ఫలితం లేదు. పాత పద్ధతిలోనే యదావిధిగా కొనసాగుతుంది. ఏసీబీ, విజిలెన్స్ దాడులు కావడంతో తాత్కాలికంగా ప్రధాన గేట్లను మూసివేశారు. వేరే గేటును తెరిచి రాకపోకలను సాగిస్తూ వాస్తు పేరు మీద కొత్త గేట్లను ఏర్పాటు చేసి ఉపయోగిస్తున్నారు. ఈ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎక్కువగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతాయి. మూడు నెలల క్రితం ఇక్కడ జరిగిన ఏసీబీ తనిఖీల్లో భారీగా అవకతవకలు బయటపడ్డాయి. ఫోన్ పేలు, నేరుగా క్యాష్ వసూలు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వారిపైన కేసులు నమోదు చేశారు. కొంత మంది డాక్యుమెంట్ రైటర్ల పైన కూడా కేసులు పెట్టారు.పది పదిహేను రోజులు కార్యాలయం బయట ఉన్న డాక్యుమెంట్ రైటర్ల షాపులను మూసి వేశారు. కొత్త స్టాఫ్ రాగానే మళ్లీ యధావిధిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ లన్నీ వారి కనుసన్నల్లోనే జరిగే విధంగా చూసుకుంటున్నారు. అధికారులు కూడా వారి ద్వారానే ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లు వారికి సంబంధించిన డాక్యుమెంట్లపైన ప్రత్యేకంగా పెన్సిల్ తో పైన గీతలు పెట్టి వాటి ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పది పదిహేను రోజులు ఉన్నతాధికారులు పర్యవేక్షించిన ఆ తర్వాత పట్టించుకోకపోవడం వల్ల యదావిధిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టిన వారి ఆధ్వర్యంలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.ఉమ్మడి జిల్లాలో ఏ కార్యాలయం చూసిన వారి ప్రమేయం లేకుండా జరగడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో మెజార్టీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. అయినా ఫలితం మాత్రం లేదు. ఎన్ని తనిఖీలు చేసిన పరిస్థితి మాత్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటికీ డాక్యుమెంట్ రైటర్లదే హవా కొనసాగుతోంది. చాలా కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లకు ఇన్?చార్జి సబ్ రిజిస్ట్రార్ గా నియమించడంతో ఇష్టం వచ్చిన రీతిలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొన్ని కార్యాలయ పరిధిలో ప్రభుత్వ భూములను బినామీ, దొంగ డాక్యుమెంట్లతో రిజిస్టర్ చేశారు. కొంతమంది పై కేసులు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేసుల్లో వేల నుంచి లక్షల రూపాయలు చేతులు మారాయి. ఉన్నతాధికారులు దృష్టి పెట్టి ప్రత్యేక చర్యలు చేపడితే తప్ప ఇది ఆగే పరిస్థితి లేదు. అధికారులు మాత్రం అంతా ఆన్ లైన్ లో బ్రోకర్ల ప్రమేయం లేకుండా జరుగుతున్నట్లు తెలిపారు. ఆన్ లైన్ లో బుక్ చేసిన స్లాట్ ప్రకారమే రిజిస్ట్రేషన్ చేస్తున్నామని చెబుతున్నారు.

# బీజేపీ సర్వేల జోరు..క్షేత్రస్థాయిలో మూడు సంస్థల కార్యకలాపాలు

హైదరాబాద్: బీజేపీ జాతీయ నాయకత్వం చేపడుతున్న 'మిషన్ తెలంగాణ' కార్యాచరణకు అనుగుణంగా...రాష్ట్రంలో వివిధ సర్వే సంస్థలు, ఏజెన్సీల క్షేత్రస్థాయి కార్యకలాపాలు ఊపందుకున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు గ్రౌండ్ వర్క్‌ను వేగవంతం చేయడంలో భాగంగా క్షేత్రస్థాయి అధ్యయనాలు, పరిశీలనలు వేగం పుంజుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎంపీ, ఎమ్మెల్యే నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించినట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితులు, సమస్యలు, ప్రజాకాంక్షలు, ప్రాధాన్యత సంతరించుకున్న అంశాలు పరిగణనలోకి తీసుకుంటూ రాష్ట్రంలో ప్రస్తుతం మూడు సర్వేసంస్థలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. పార్టీపరంగా, నేతల పర్యవేక్షణలో, పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్రంగా.. ఇలా వివిధ రూపాల్లో ఇవి పనిచేస్తున్నాయి.

అధికార సాధనకు 'అభీష్ట'...

పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన 'అభీష్ట'సంస్థ తాజాగా రాష్ట్ర బీజేపీ కోసం పనిచేయడం ప్రారంభించింది. తొలుత రాష్ట్రంలో సాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియకు సంబంధించిన అంశాలను ఈ సంస్థ ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. త్వరలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో...ప్రదానంగా ఈ ఎన్నికల కోసం రాష్ట్రపార్టీ సమన్వయంతో ఈ సంస్థ పనిచేసేందుకు సిద్ధమౌతున్నట్టు తెలుస్తోంది. సర్‌కు సంబంధించిన పరిశీలనలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్‌కు ఈ సంస్థ నివేదిస్తున్నట్టు తెలిసింది. సర్‌లో భాగంగా బీజేపీ బూత్ లెవెల్ ఏజెంట్లు ఏం చేస్తున్నారు? రాష్ట్రంలో ఈ ప్రక్రియ ఎలా సాగుతోంది? పార్టీపరంగా ఏం చేయాలి? ఏయే అంశాలపై దృష్టి పెట్టాలి? అనే అంశాలపై రాష్ట్ర నేతలకు ఈ బృందం దిశానిర్దేశం చేస్తున్నట్టు సమాచారం. మున్సిపల్ ఎన్నికల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల దాకా 'అభీష్ట'పార్టీ కోసం పనిచేయనున్నట్టు తెలిసింది.

ఏబీఎం, జార్విస్

కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా కార్యాలయం పర్యవేక్షిస్తున్న 'అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్'(ఏబీఎం) ఎన్నికల కన్సల్టెన్సీ సంస్థ కూడా గత కొంత కాలంగా తెలంగాణపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తోంది. ఈ ఏజెన్సీ



రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తుండగా.. దీని ద్వారా బీజేపీ ఎజెండాను, పార్టీ ప్రచారం వ్యూహానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను చేపడుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు 'జార్విస్'అనే మరో కన్సల్టెన్సీ సంస్థ కూడా ఎన్నికల సంబంధిత ముందస్తు తయారీ, కార్యక్రమాల రూపకల్పన, తదితర అంశాలపై దృష్టి పెట్టి విధులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ కోసం విస్తృతమైన కాల్ సెంటర్లను ఈ సంస్థ నిర్వహిస్తోంది. తెలంగాణలో నమోదైన ఓటర్లను సంప్రదించడం, వారి నుంచి వివిధ అంశాలపై ఫీడ్ బ్యాక్ తీసుకోవడం వంటి వాటిని చేపడుతున్నట్టు తెలిసింది. బూత్ కమిటీల నియామకం, వాటి పర్యవేక్షణ, క్షేత్రస్థాయి కార్యకర్తల సమీకరణ తదితర అంశాలను ఈ కన్సల్టెన్సీ పర్యవేక్షిస్తోంది. బీజేపీ అన్ని రాష్ట్రాల్లో ఉపయోగించే సరళ్ యాప్ అభివృద్ధి, నిర్వహణతో జారి?వస్ సంస్థకు సంబంధం ఉన్నట్టుగా పార్టీవర్గాల సమాచారం.

**కొత్తపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం**

తాండూర్,తాండూరు మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధార్ కార్డు లేని ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని, ఇప్పటికే ఆధార్ ఉన్నవారు మొబైల్ నంబర్ లింక్ చేయించుకోవడం, పేరు, చిరునామా, జన్మతేది వంటి వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలంతా సద్వినియోగం

# ఏపీలో విస్తరిస్తున్న కరోనా.. 32కి చేరిన కేసులు




అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ మళ్లీ నెమ్మదిగా తన ప్రభావాన్ని చూపుతోంది. గడిచిన 24 గంటల్లో విశాఖపట్నం, రాజమండ్రి పరిధిలో కొత్తగా మూడేసి చొప్పున (మొత్తం 6) కేసులు వెలుగుచూడటంతో రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య ఒక్కసారిగా 32కి చేరుకుంది. ఇప్పటివరకు గుంటూరు, కాకినాడ, పార్వతీపురం మన్యం, తూర్పు గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, నెల్లూరు, బాపట్ల వంటి అనేక జిల్లాల్లో పాత కేసులు నమోదు కాగా, ఇప్పుడు కొత్తగా విశాఖ, రాజమండ్రి పరిసర ప్రాంతాలకు వైరస్ విస్తరించడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో వైద్యాధికారులు ఆయా జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

కొత్త వేరియంట్ RF.5 గుర్తింపు: వైద్య నిపుణుల హెచ్చరికలు

ఈ క్రమంలో కడప జిల్లాలో వెలుగుచూసిన బాధితుల నుండి సేకరించిన శాంపిళ్లను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (NIV)కి పంపగా, అక్కడ నిర్వహించిన జీనోమ్ సీక్వెన్సింగ్‌లో ఇది ఒమిక్రాన్ =ఫీ.5 వేరియంట్ అని నిర్ధారణ అయింది. ఈ కొత్త రూపాంతరం వేగంగా సంక్రమించే గుణం కలిగి ఉండటంతో నిపుణులు అప్రమత్తత అవసరమని సూచిస్తున్నారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించడం, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవడం మేలని ఆరోగ్య శాఖ సూచిస్తోంది.

**మెడికవర్ ఆసుపత్రిలో మూవ్ మెంటమ్ పేరిట ఫిట్ నెస్ సెషన్**

సికింద్రాబాద్,సికింద్రాబాద్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో "మూవ్మెంటమ్ 2026" పేరుతో 25 వేలకుపైగా విజయవంతమైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జుంబా ఫిట్నెస్ సెషన్లో రోగులు ఉత్సాహంగా పాల్గొని, శస్త్రచికిత్సల అనంతరం తిరిగి పొందిన ఆరోగ్యం, చురుకుదనం, ఆత్మవిశ్వాసాన్ని నృత్యాల రూపంలో ప్రదర్శించారు..చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ఉదయ్ కృష్ణ ఆధ్వర్యంలో చికిత్స పొందిన వంద మంది రోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ జుంబా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జుంబా ఫిట్నెస్ సెషన్లో రోగులు ఉత్సాహంగా పాల్గొని, శస్త్రచికిత్సల అనంతరం తిరిగి పొందిన ఆరోగ్యం, చురుకుదనం, ఆత్మవిశ్వాసాన్ని

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140